తీన్మార్
తెలుగు దినపత్రిక

# టాలీవుడ్ వర్సెస్ సర్కార్...

సంధ్య థియేటర్ తొక్కిసలాట పెద్ద దుమారాన్నే రేపుతోంది. అల్లు అర్జున్ అరెస్ట్, అనంతరం పరిణామాలు టాలీవుడ్ వర్సెస్ ప్రభుత్వం అన్నట్లు మారుతున్నాయి. అయితే గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. దక్షిణ భారతదేశంలో సినీ పరిశ్రమకు రాజకీయాలకు చాలా దగ్గర సంబంధం ఉంటుంది. సినీ పరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి వచ్చి చక్రం తిప్పిన వారు ఎందరో ఉన్నారు. ఎంజీఆర్, ఎన్టీఆర్, జయ లలిత సీఎంలు అయితే...చిరంజీవి, బాలకృష్ణ, పవన్ కల్యాణ్, రోజా, ఉదయనిధి స్టాలిన్....ఇలా ఎంతో మంది కీలక పదవులు నిర్వర్తించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలు కొని ఇప్పటి తెలుగు రాష్ట్రాల వరకూ సినీపరిశ్రమ, రాజకీయ నేతల మధ్య పెద్ద యుద్ధాలే జరిగాయి. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు సూపర్ స్టార్ కృష్ణతో ఆయనకు రాజకీయ విభేదాలు తలెత్తాయి. ఇటీవల పరిస్థితులు చూస్తుంటే సినీ పరిశ్రమ సైతం రాజకీయ పార్టీలకనుగుణంగా మద్దతు పలుకుతున్నాయని తెలుస్తోంది.సినీ పెద్దలు టీడీపీకి మద్దతుగా ఉండేవారు. ఇప్పటికీ కొందరు బహిరంగంగానే తమ మద్దతు తెలుపుతుంటారు. ఎన్టీఆర్ సినీ పరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి ఆరు నెలల్లో సీఎం కావడంతో... ఆయనకు దగ్గరి వారంతా టీడీపీగా మద్దతుగా ఉండేవారు. ఎన్టీఆర్ అనంతరం పార్టీ చంద్రబాబు చేతుల్లోకి వచ్చిన తర్వాత కూడా...సినీ పెద్దల మద్దతు కొనసాగింది. నేటికీ ఆ సంబంధాలను చంద్రబాబు కొనసాగిస్తుంటారు. అయితే 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సినీ పరిశ్రమ రాజకీయ పార్టీల వారీగా విడిపోయింది. టీడీపీ, వైసీపీ, జనసేనకు మద్దతుగా విడిపోయారు. ఎక్కువ మంది టీడీపీకి మద్దతుగా ఉన్నా..బయటపడేవారు కాదు. అయితే టీడీపీ ఏపీకి షిఫ్ట్ అవ్వడంతో...తెలంగాణలో ఎవరికి మద్దతుగా ఉండాలనే డైలమా సినీ పెద్దల్లో ఉండేది. రాష్ట్రం విడిపోయిన తర్వాత తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం చేపట్టడంతో తెలంగాణలో బీఆర్ఎస్ మద్దతుగా సినీ పరిశ్రమ ఉండేదని బహిరంగ రహస్యం. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీకి సినీ ప్రముఖుల మద్దతు ఉంటుందనేది వాస్తవంమెగాస్టార్ చిరంజీవి రాజకీయాల్లో అంతగా రాణించలేకపోవడం పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయడం చకచకా జరిగిపోయాయి. ఈ పరిస్థితులను పరిశీలించిన పవన్ కల్యాణ్...రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. జనసేన పేరిట పార్టీ పెట్టారు. దీంతో మెగాఫ్యాన్స్ మద్దతు పవన్ పార్టీకి చేరింది. సినీ పరిశ్రమలో చిరంజీవి మద్దతుదారుల్లో కొందరు జనసేనకు మద్దతుగా నిలిచారు. ఇదంతా బాగానే ఉన్నా....2019 ఎన్నికల్లో వైసీపీ విజయంతో సీన్ రివర్స్ అయ్యింది. ఏపీలో పవన్ కల్యాణ్ అడ్డుకునేందుకు వైసీపీ విశ్వప్రయత్నాలు చేసింది. పవన్ కల్యాణ్ సినిమాలను అడ్డుకునేందుకు టికెట్ రేట్లను భారీగా తగ్గించారనే విమర్శలు వచ్చాయి. సామాన్యుడికి అందుబాటులో టికెట్ ధరలు పేరిట చట్టాలు చేసి...థియేటర్ల వద్ద అధికారులను పహారా పెట్టిన పరిస్థితులు సైతం చూశాం. సినీ పరిశ్రమ నుంచే కొందరిని రంగంలోకి దింపి పవన్ కల్యాణ్ పై ముప్పేట దాడి చేయించేవారు. పవన్ కల్యాణ్ కూటమితో జతకట్టడంతో...సినీ పరిశ్రమ నుంచి ఆయనకు మరింత మద్దతు పెరిగిందనే చెప్పాలి. టికెట్ల ధరలు తగ్గించడంపై అప్పట్లో సంచలనం అయ్యింది. పవన్ కల్యాణ్ లక్ష్యంగా వైఎస్ జగన్ ఈ విధంగా చేశారని సినీ పెద్దలు బహిరంగంగానే విమర్శించారు. వైఎస్ జగన్ పవన్ ను అడ్డుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశారనేది బహిరంగ రహస్యం.ఇక తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఓడిపోవడం...కాంగ్రెస్ అధికారంలో రావడం జరిగిపోయాయి. ఇన్నాళ్లు బీఆర్ఎస్ కు మద్దతుగా ఉన్న సినీ ప్రముఖులు...కాంగ్రెస్ కు అంత తొందరగా షిఫ్ట్ అవ్వలేదనే చెప్పుకోవాలి. సినీ నటుడు నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేత, నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ వివాదాస్పద కామెంట్స్...కాంగ్రెస్ ప్రభుత్వంపై టాలీవుడ్ కి ఆగ్రహం తెప్పించాయనే చెప్పాలి. ఇక తాజాగా అల్లు అర్జున్ వివాదంతో తెలంగాణ ప్రభుత్వానికి టాలీవుడ్ కి మధ్య మరింత గ్యాప్ పెంచాయి. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనపై సీరియస్ అయిన తెలంగాణ ప్రభుత్వం...అల్లు అర్జున్ పై చర్యలు తీసుకుంది. అరెస్టు వరకు వెళ్లడం, హైకోర్టు బెయిల్ తో అల్లు అర్జున్ బయటపడడం జరిగాయి. తాజాగా ఈ వివాదాన్ని అసెంబ్లీలో ప్రస్తావించిన సీఎం రేవంత్ రెడ్డి అగ్నికి మరింత ఆజ్యం పోయారు. సీఎం రేవంత్ రెడ్డి విమర్శలపై స్పందించిన అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టి తన తప్పులేదని చెప్పుకున్నారు.నంది అవార్డుల తరహాలో తెలంగాణలో గద్దర్ అవార్డులు ప్రకటిస్తామని సీఎం రేవంత్ రెడ్డి గతంలో ప్రకటించారు. ఈ అంశంపై సినీ పరిశ్రమ నుంచి పెద్దగా స్పందన రాలేదు.

మధ్యలో ఒకసారి సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై అసహనం వ్యక్తం చేశారు. చిరంజీవి స్పందించినప్పటికీ విషయం ముందుకు వెళ్లలేదు. మంత్రి కొండా సురేఖ వివాదంలో సినీ పరిశ్రమ మొత్తం ఏకమవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వానికి కాస్త ఇబ్బందిగా మారింది. దీంతో బీఆర్ఎస్ కాంగ్రెస్ ఇరుకున పెట్టేందుకు మరో అంశం దొరికింది. ఈ క్రమంలో పుష్ప-2 ప్రీ రిలీజ్ ఈవెంట్ లో అల్లు అర్జున్ సీఎం రేవంత్ రెడ్డి పేరు మర్చిపోవడం, కేటీఆర్ ఈ విషయాన్ని మీడియా ముందు పదేపదే ప్రస్తావించడం ఇలా...అనేక కారణాలు టాలీవుడ్ లో పెద్ద దుమారాన్నే రేపాయి. సంధ్య థియేటర్ తొక్కిసలాట నేపథ్యంలో ఇకపై తెలంగాణలో బెనిఫిట్ షోలు, టికెట్ల ధరలు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రభావం సంక్రాంతి రానున్న భారీ బడ్జెట్ సినిమాలపై పడనుంది. టాలీవుడ్, తెలంగాణ ప్రభుత్వానికి మధ్య ఏర్పడిన గ్యాప్ ను తగ్గించేందుకు సినీ పెద్దలు చొరవ చూపుతారా? ఈ సమస్య ఎలా పరిష్కారం అవుతుందో వేచిచూడాలి.

# వికలాంగునికి ఎలక్ట్రానిక్ వెహికల్ అందజేసిన ప్రొ. జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా బుద్ధారం గ్రామపంచాయతీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మల్లెబోయిన స్వామి గత కొన్ని సంవత్సరాల క్రితం లారీ ఆక్సిడెంట్ లో కుడికాలు శాశ్వతంగా కోల్పోవడం జరిగింది అప్పటినుండి స్వామి ఇంటికే పరిమితం కావడంతో అప్పటినుండి అతని భార్య ఇంటి కోసం పడుతున్న కష్టం చూడలేక ఏదైనా చేయాలని తపనతో స్వయం ఉపాధిగా కోసం వారి ఊరు నుండి పరకాల మండల కేంద్రానికి వచ్చి మెయిన్ రోడ్డు పక్కన బజ్జీల బండి పెట్టుకొని బజ్జీలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు అటుగా వెళుతున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి అతని పరిస్థితి చూసి చెలించిపోయి అతనితో మాట్లాడగా నాకు ఒక ఛార్జింగ్ బండి కావాలని లేకుంటే చాలా ఇబ్బంది అవుతుందని కన్నీరు పెట్టుకుంటూ అయిలి మారుతితో చెప్పడంతో వెంటనే



స్పందించిన ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతీ అతని కోరిక ప్రకారం చార్జింగ్ ట్రై సైకిల్ కొన్ని అతనికి ఉచితంగా ఇవ్వడం జరిగింది.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో పక్కాగా సమాచారం సేకరించాలి

**- మొబైల్ యాప్ ద్వారా వివరాలు నమోదు చేయాలి**

**- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేయాలన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి, సంబంధిత అధికారులు మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు, ఎంపీఓలతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సర్వే ఇంటింటి కి వెళ్లి మొబైల్ యాప్ ద్వారా నమోదు చేస్తున్న వివారాలు సంబంధిత డాక్యుమెంట్ల ను సేకరించి మొబైల్ యాప్ ద్వారా అడుగుతున్న ఆన్ని కాలమ్స్ కరెక్టుగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా జిల్లాలో వచ్చిన దరఖాస్తులు ప్రజాపాలన పెట్టుకోవడం జరిగిందన్నారు. ఈ సర్వేను ప్రభుత్వం సూచించిన గడువులోగా పూర్తి చేయాలని, సర్వే చేసే సర్వేయర్ లు ఎలాంటి పొరపాట్లు జరగకుండా సర్వే చేయాలని, సర్వే చేసేటప్పుడు ఇందిరమ్మ కమిటీ సభ్యుల సహాయ సహకారాలు తీసుకోవాలని, ఇందిరమ్మ కమిటి సభ్యులు తప్పకుండా ఈ సర్వేలో పాల్గొనాలని, సర్వేకు సంబంధించిన ప్రతి అవసరం ఉన్న డాక్యుమెంట్ల ను ఇంటి సభ్యులు చూపించి సర్వే సాఫీగా జరిగేందుకు సహకరించాలని ఆన్నారు. అలాగే మున్సిపాలిటీల్లో కూడా ఈ సర్వే పూర్తి చేయాలనీ ఆదేశించారు. సర్వే అనంతరం శాతం ఎంపీడీవో లు మున్సిపల్ కమిషనర్ లు సూపర్ చెక్ చేయాలని, సర్వేలో పేరు, వివరాలు, ఫొటో, తదితర వివరాలు సరిగా ఉందా లేదా చెక్ చేసిన తరువాత



ప్రభుత్వానికి నివేదికలు పంపించడం జరుగుతుందని, ప్రభుత్వం ఆదేశాల మేరకు అర్హులు ఎంత మంది ఉన్నారో పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ఇందిరమ్మ కమిటీ పంచాయతీ సెక్రటరీలు గడువులోగా సర్వే పూర్తి చేయాలనీ ఆన్నారు. ఇప్పటి వరకు ఎన్ని నమోదు చేశారని అడిగి తెలుసుకొని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, తొందరపాటుగా కాకుండా జాగ్రత్తగా తప్పులు జరుగకుండా నమోదు చేయాలని, మోబైల్ యాప్ లో నమోదు చేసేటప్పుడు, ఏమైనా సమస్యలు ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, హౌజింగ్ డి.ఈ రాజయ్య, మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ మున్సిపల్ కమిషనర్లు రవీందర్, వెంకటస్వామి, నరేష్ రెడ్డి, సూపర్డెంట్ నారాయణమూర్తి, ఈ డిస్టిక్ మేనేజర్ ప్రశాంత్, ఎంపీడీవో లు,ఎంపీవోలు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలి

మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్): వినియోగదారుల రక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహనా కల్పించాలని, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.వీరబ్రహ్మాచారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 1986 డిసెంబర్ 24 న అమలులోకి వచ్చిందని అలాగే వినియోగుదారు ల ప్రయోజనాలను పరిరక్షించడానికి వినియోగదారుల ఫోరమ్స్ చక్కగా పనిచేస్తున్నాయని అన్నారు. డిజిటల్ విధానం, వర్చువల్ విచారణాల ద్వారా వినియోగదారులకు సత్వర న్యాయం అందేలా సంఘాలు పనిచేయాలని సూచించారు. వినియోగదారులు ఆహర పదార్ధాలు, నగలు, ఇతర ఏ వస్తువైన కొనుగోలు చేసేటప్పుడు ధర, నాణ్యతా ప్రమాణాలు తెలుసుకొని కొనుగోలు చేయాలని అన్నారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే సత్వరమే వినయోగదారుల ఫోరమ్ లో అర్జీ దాకాలు చేసి న్యాయ పరంగా నష్ట పరిహారం పొందాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారుల హక్కులు, చట్టాలపై అన్ని వినియోగదారుల సంఘాలు ప్రత్యేక కృషి చేస్తున్నాయని అభినందించారు. అలాగే ప్రజలతో పాటు పాఠశాల, కళాశాల విద్యార్థులలో కూడ వినియోగదారుల చట్టాలపై చైతన్యం కల్పించాలని అన్నారు. ముఖ్యాంగా ఆహార తనిఖీలలో శాఖాధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టలని అన్నారు. వినియోగదారులు ఎక్కడకూడా నష్టపోకుండా నాణ్యమైన వస్తువులు



కొనుగోలు చేయాలని నకిలీ వస్తువుల మోసాల నుండి బయట పడాలంటే వినియోగదారులలో చైతన్యం అవసరమని అన్నారు. వినియోగదారుల సంఘాల సూచనలు, సలహాలు తప్పక పరిగణలోకి తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో డిసిఎస్ఓ ప్రేమ్ కుమార్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కృష్ణవేణి, వివిధ సంఘాల అధ్యక్షులు, సుధాకర్, జానీ, విజయ్ కుమార్, శ్రీనివాస్ , సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెద్దగట్టు జాతర ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



సూర్యాపేట, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా దురాజ్ పల్లిలో త్వరలో జరగనున్న పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర ఏర్పాట్లు యొక్క పరిసరాలను జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాతర యొక్క పరిసరాలను, దేవాలయ ప్రదేశాన్ని, రోడ్డు మార్గాలను, భక్తులు వేచి ఉండే స్థలాలు వాహనాల పార్కింగ్ ప్రవేశాల స్థితిగతులను ఎస్పీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరిగినదని ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లి జాతరను ప్రశాంతంగా నిర్వహిస్తామని, పెద్దగట్టు జాతర యొక్క పోలీసు బందోబస్తు కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించాలని స్థానిక పోలీస్ అధికారులకు, స్పెషల్ బ్రాంచ్ పోలీసుల కు



తెలిపినారు. జాతీయ రహదారి వెంట వాహనాల రాకపోకల కు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇతర శాఖల అధికారులతో కలిసి సమన్వయంగా పని చేయాలని తెలిపారు. జాతర ప్రాంగణంలో కావాల్సిన రక్షణ ఏర్పాట్లకు సంబంధించి ప్రణాళిక రూపొందించుకోవాలని ఇతర శాఖలతో సమన్వయంతో ముందుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. బందోబస్తు ప్రణాళిక పై స్పెషల్ బ్రాంచ్ దృష్టి పెట్టి పని చేయాలని అన్నారు.అనంతరం దైవ దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రవి, సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, స్థానిక ఎస్సై మహేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

# 29న కృతజ్ఞతా సభకు తరలిరండి..



ఆర్మూర్ : పట్టణం మామిడి పల్లీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కృతజ్ఞతా సభ గోడ ప్రజల ఆవిష్కరణ జిల్లా అధ్యక్షులు జమీలులా చేతుల మీదుగా మంగళవారం నిర్వహించినారు. గత 24 సంవత్సరాల తెలుగు, హిందీ, ఉర్దూ భాష పండితుల పదోన్నతుల కలను నెరవేర్చిన ప్రభుత్వానికి డిసెంబర్ 29వ తేదీన కృతజ్ఞతా సభ న్యూ అంబేద్కర్ భవన్ లో జరుగును. ఇట్టి సభకు తెలుగు, హిందీ ,ఉర్దూ భాషోపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి శ్రీ మహమ్మద్ షబ్బీర్ అలీ ప్రభుత్వ సలహాదారులు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ, టిపి సి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, తాహర్ బిన్ హండాన్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, అర్బన్ నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి, డిసిసి ప్రెసిడెంట్ మానాల మోహన్ రెడ్డి, అతితులుగా పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారు గంగామోహన్ రాష్ట్ర కార్యదర్శి నగేష్ కుమార్, జిల్లా అదనం కార్యదర్శి శ్రీనివాస్ గారు, సురేష్, జగదీష్ ప్రధానోపాధ్యాయులు రవీందర్ భాను ప్రకాష్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ సిబ్బందికి అవగాహన..



కంఠేశ్వర్ : తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు మంగళవారం నిజామాబాద్ ఇంచార్జిపోలీస్ కమీషనర్ సింధూశర్మ, ఐ.పి.యస్ సూచనల మేరకు నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సైబర్ క్రైమ్ సిబ్బందిని చైతన్యం చేయడం కోసం అదనపు పోలీస్ కమీషనర్ (అడ్మిన్) జి. బస్వారెడ్డి పర్యవేక్షణలో సైబర్ క్రైమ్ ఎ.సి.పి వై. వెంకటేశ్వర రావు నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు పోలీస్ కమీషనర్ (అడ్మిన్) మాట్లాడుతూ.. సాంకేతిక వినియోగం ఎక్కువ కావడం వల్ల సైబర్ నేరాల సంఖ్య అదే స్థాయిలో పెరిగి పోయిందని, సైబర్ నేరాలకు చెక్ పెట్టడం, సైబర్ క్రైమ్ సిబ్బంది సమర్ధవంతంగా సేవలందించడం లక్ష్యంగా పని చేయాలని , సైబర్ క్రైమ్ సిబ్బంది గ్రామ గ్రామాన అవగాహణ కార్యక్రమాలు చేపట్టాలని. ఈ మధ్య కాలంలో డిజిటల్ అరెస్టు అని చాలా ఫోన్లు వస్తున్నందున అసలు డిజిటల్ అరెస్టులు అనేది ఎక్కడ లేదని, ఇందు కోసమే పోలీస్ శాఖ ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించి 1930 ద్వారా కూడా సైబర్ క్రైమ్ రిపోర్ట్ చేయవచ్చని ప్రధానంగా భాదితులు డబ్బులు పోయిన వెంటనే ఫిర్యాదుచేయడానికి ముందుకు రావాలని, మోసపూరిత లావాదేవీలు జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే వాటిని తక్షణం నిలిపి వేసి సంబంధిత వారి యొక్క ఖాతా ను ఫ్రీజు చేసే విధంగా చూడాలని, సైబర్ నేరాల కేసుల్లో పూర్తి స్థాయి ఆధారాలను సేకరించి నేరస్థులను గుర్తించాలని, వారికి శిక్ష పడేలా చేయడం తద్వారా భాధితులకున్యాయం చేయాలని సూచించారు. ఇందుకోసం నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల లలో ప్రజలకు అవగాహణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు.ఈ కార్యాక్రమంలో సైబర్ క్రైమ్ పోలీసులు పవర్పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యాక్రమంలో సైబర్ క్రైమ్ ఎ.సి.పి వై. వెంకటేశ్వర రావు నిజామాబాద్ ఎ.సి.పి. రాజా వెంకట్ రెడ్డి, టౌన్ సి.ఐ శ్రీనివాస్ రాజ్, డిచ్పల్లి సి.ఐ మల్లేష్ సైబర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ముకీద్ పాషా, సి.సి.ఆర్.బి సిబ్బంది మరియు సైబర్ క్రైమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ అశోక్ నగర్ లో యువతి ఆత్మహత్య..



హైదరాబాద్ : హైదరాబాద్ లో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. నిజామాబాద్ జిల్లా గాంధారి మండలం అవుసులకుంట తండాకు చెందిన యువతి సురేఖ(22) సోమవారం రాత్రి అశోక్ నగర్? లోని తన రూంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సదరు యువతి హైదరాబాద్ లో గ్రూప్ 2 కోచింగ్ తీసుకుంటుందని, గత కొన్ని రోజుల క్రితం యువతికి వివాహం నిశ్చయమైందని తండా వాసులు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ ఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# వస్తువు కొనుగోలుకు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి

**– అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్): వినియోగదారులు వస్తువు కొనుగోలుకు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినియోగ దారుల అవగాహన సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రభుత్వం డిజిటల్ విధానం మరియు వర్చువల్ విచారణల ద్వారా వినియోగదారుల న్యాయం అనే థీమ్ ను ప్రకటించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు దైనందిన జీవితంలో కోనుగోలు చేయు వస్తువులకు బాధ్యతగా బిల్లులు తీసుకుని భద్రపరచుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన వస్తువు పాడైతే నిర్ణీత సమయంలో వినియోగదారుల హక్కుల ఫోరంలో ఫిర్యాదు చేసి జరిగిన నష్టానికి తగిన పరిహారం పొందడానికి అవకాశం ఉందని అన్నారు. మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు దగ్గర నుండి నిత్యావసర వస్తువులు, బట్టలు,ఆన్లైన్ లో కొనుగోలు చేసిన వస్తువులల్లో వినియోగదారుడు మోసపోయినట్లు కానీ నాణ్యత లేనపుడు కానీ వినియోగదారులు బిల్లుతో పిర్యాదు చేయడానికి అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల తప్పనిసరి బిల్లులను భద్రపరచుకోవాలని సూచించారు. వస్తువు తూకపు సమయంలో వినియోగదారులు నిశితంగా పరిశీలించాలని తెలిపారు. తూకాలలో మోసపోవద్దని వస్తువు కొనుగోలులో పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వ్యాపారస్తులు ఉపయోగించే తూనికలు కొలతల పరికరాలకు సకాలంలో ముద్ర వేయించుకొని లైసెన్స్ తీసుకోవాలని చెప్పారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రజలకు వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అనంతరం వినియగదారుల హక్కులు, భాధ్యతలు, న్యాయ సహాయం, చట్టాలు తదితర అంశాలతో కూడిన కరపత్రాన్ని అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డిఎం రాములు, డిసిఐసి ఇంచార్జి అధికారి మల్లయ్య, డిఆర్డీఓ నరేష్, కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్, రైస్ మిల్లర్స్, గ్యాస్, చౌక ధరల దుకణాల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరేళ్ల బాలుడు మిస్సింగ్ కలకలం!

**– ఆందోళనలో తల్లిదండ్రులు**



దేవరకద్ర ప్రతినిధి, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్)

మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామం చిన్నారి మిస్సింగ్ కలకలం రేపింది.రెండు రోజులుగా చిన్నారి ఎర్రమందెల అఖిల్(6)కనిపించకుండా పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు తల్లిదండ్రులు.ఇంటి ముందు ఆడుకుంటుండగా అఖిల్ కనబడడం లేదని తల్లిదండ్రులు మిస్సింగ్పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.దీంతో రంగంలోకి దిగిన పోలీసులు..బాలుడి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.నిన్నటి నుంచి పోలీసులు కూడా గాలిస్తున్నా అఖిల్ జాడ లభించకపోవడంతో పేరెంట్స్ ఆందోళన మరింత ఎక్కువైంది.అఖిల్ ఎక్కడున్నాడో అని తల్లిదండ్రులు టెన్షన్ పడుతున్నారు.ప్రజలు కూడా జాడ కోసం సహకరించాలని చిన్నచింతకుంట పీస్ నెంబర్ 8712659354 విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.తమ కుమారుడు క్షేమంగా తిరిగి రావాలని తల్లిదండ్రులు దేవుడిని ప్రార్థిస్తున్నారు.

# ఆన్లైన్ మోసాలు,సైబర్ నేరాల పై జాగ్రత్తగా ఉండాలి

**జిల్లా లీడ్ డిస్టిక్ మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే**



కొత్తకోట, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని మహిళా మండల సమైక్య భవనంలో రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్ కు ముఖ్య అతిథిగా జిల్లా లీడ్ డిస్టిక్ మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌశల్ కిషోర్ పాండే మాట్లాడుతూ ఖాతాదారులు డిపాజిట్ ఖతాల గురించి తెలుసుకోవాలి మరియు ఏటీఎం వాడేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అదేవిధంగా ప్రతి ఒక్క సామాన్య పౌరుడికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన చాలా ముఖ్యమైనదని తప్పకుండా ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమ%శీ% ను ఉద్దేశించి కొత్తకోట ఎస్సై ఆనంద్ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి అని డిజిటల్ పేమెంట్స్ ఉపయోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి అని, మీ యొక్క ఓటీపీ పిన్ నెంబర్లు వ్యక్తిగత వివరాలు ఇతరులతో పంచుకోకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి కొత్తకోట యూనియన్ బ్యాంక్ మేనేజర్ స్రవంతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కూడా వ్యక్తిగత పొదుపు అనేది చాలా ముఖ్యమని ఇప్పటినుంచే మీరు అనుసరిస్తూ మీ యొక్క పిల్లలకు కూడా నేర్పించాలి అని చెప్పారు. ఈ వర్క్ షాప్, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ అధ్వర్యములో, ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు మరియు ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్ పర్యవేక్షణ లో నిర్వహించ డమైనది. అలాగే ఈ కార్యక్రమంలో ట్రైనర్ అశోక్ మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ,కేవైసీ, నామిని, DICGC గురించి చెప్పడం జరిగింది. అదేవిధంగా రిసోర్స్ పర్సన్ శేఖర్ మాట్లాడుతూ విద్యాలక్ష్మి,ఉద్గం పోర్టల్ గురించి తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమం ఉద్దేశించి రిసోర్స్ పర్సన్ శశికళ మాట్లాడుతూ ప్రతి ఒక్క వ్యక్తి కూడా పొదుపు పట్ల అవగాహన కలిగి ఉండాలని బడ్జెట్ ఏ విధంగా చేసుకోవాలని కూడా తెలియజేయడం జరిగినది. చివరిగా ప్రోగ్రాం కోఆర్డినేట్ శివుడు మాట్లాడుతూ డిపాజిట్ ఖాతాలతో కలిగేటువంటి అదనపు ప్రయోజనాల గురించి వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో MPO వెంకటేశ్వర్లు, DPM రాములు, MPO సుదర్శన్,APM రాజశేఖర్ రెడ్డి ట్రేనర్స్ అశోక్,శేఖర్ రిసోర్స్ పర్సన్ శివుడు,శశికళ మరియు సీసీ లు మహిళా మండల సమైక్య సిబ్బంది, మహిళలు పాల్గొనడం జరిగినది.

# రూ. 2.30 కోట్లతో అభివృద్ధి పనులకు కౌన్సిల్ తీర్మానం



నాగారం, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్): మున్సిపల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం నాగారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు గాను రూ. 2.30 కోట్లతో కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మున్సిపాలిటీలోని 20 వార్డులలో అభివృద్ధి పనులకు గాను 2 కోట్ల 30 లక్షలకు సిసి రోడ్లు, భూగర్భ డ్రైనేజీ కాలువలు, ఇతర పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గత 5 సంవత్సరాలలో నాగారం మున్సిపాలిటీకి అన్ని రంగాలలో అభివృద్ధికి సహకరించిన కౌన్సిల్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ కే. చంద్రశేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ ని అవమానించిన అమిత్ షా పదవికి రాజీనామా చేయాలి




ఆత్మకూర్, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ అవమానించిన కేంద్ర హెరీం శాఖ మంత్రి అమిత్ షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని మక్తల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ నాయకులు కృష్ణకాంత్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసిన కేంద్ర హెరీం మంత్రి అమిత్ షా పార్లమెంట్ ఉద్దేశించి అంబేద్కర్ అనేది ఒక ఫ్యాషన్ అయిందంటూ అవహేళన చేసి మాట్లాడడం అంబేద్కర్ పట్ల బీజేపీకి ఉన్న వ్యతిరేకత దేశ ప్రజలకు అర్థమైందని విమర్శించారు. వెంటనే హెరీమంత్రిగా ఎంపీ సభ్యత్వానికి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పట్ల ఎప్పటి నుండో బిజెపి వ్యతిరేకత కనబరుస్తూనే ఉ ందని అన్నారు మతోన్మాద బిజెపి అసలు రంగు విషయం ఇప్పుడు బయటకు కక్కారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో న్యాయం పరిరక్షించాల్సిన హెరీంమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని వెంటనే ఆయన ను క్యాబినెట్ నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలకు హెరీం మంత్రి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్నిమర్చి మనువాదం ను దేశ ప్రజలపై రుద్దలానే అక్కసుతో ఈ విధంగా బిజెపి అంబేద్కర్ పట్ల రాజ్యాంగం పట్ల విషపూరితంగా ప్రవర్తిస్తున్నదని దీనిని ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు.

# అమిత్‌షా రాజీనామా చేయాలి




దేవరకద్ర, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఏఐసీసీ ఆదేశాల మేరకు మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీ చంద్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అనిరుద్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా, బిజెపికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసిన కాంగ్రెస్ శ్రేణులు. అనంతరం నాయకులు మాట్లాడుతూ భారత పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన అమిత్‌షాకు కేంద్రహెూంమంత్రి పదవిలో కొనసాగే అర్హత లేదని, తక్షణమే అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అమిత్ షా చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎందుకు స్పందించట్లేదో తెలపాలని అన్నారు. తదనంతరం అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా ను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని రాష్ట్రపతిని కోరుతూ వినతి పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ని కలిసి అందజేసిన కాంగ్రెస్ నాయకులు.

# కబ్జాదారులు.. రెవెన్యూ ఇన్స్పెక్టర్పై దాడి

**– జవహర్ నగర్ లో అక్రమ కట్టడాల కూల్చివేత**

**విధినిర్వహణలో ఉన్న రెవెన్యూ సిబ్బందిపై దాడి**

**– కాప్రా తహశీల్దార్ సుచరిత**



జవహర్ నగర్, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు వెళ్ళిన రెవెన్యూ ఇన్స్పెక్టర్పై భూకబ్జాదారులు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన జవహర్ నగర్ కార్పొరేషన్ పరిధి దేవేందర్నగర్ లో చోటుచేసుకుంది. కాప్రా తహశీల్దార్ సుచరిత ఆదేశాల మేరకు జవహర్ నగర్ కార్పొరేషన్లోని సర్వే నెం. 645, 646, 655 దేవేందర్నగర్లో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను కూల్చివేసేందుకు రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో కలిసి పోలీసుల సహకారంతో మంగళవారం కూల్చివేతలు చేపట్టారు. ఈ క్రమంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుండగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, సాయి కబ్జాదారులు ఒక్కసారిగా దాడికి పాల్పడి గాయపర్చారు. వెంటనే రమేష్ను స్థానికంగా ఓ ప్రైవేట్ హాస్పిటల్కు తరలించారు. విధినిర్వహణలో ఉన్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్పై దాడి చేసిన నిందితులైన ఇరుగదిండ్ల వెంకటేష్, రాపానోళ్ళ రాజు, వడ్డెర శ్రీను, ముగ్గురు గుర్తు తెలియని మహిళలపై జవహర్ నగర్ పోలీస్టే స్టేషన్లో తహశీల్దార్ సుచరిత ఆదేశాల మేరకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, సాయి దాడి హేయమైన చర్య: సుచరిత, కాప్రా తహశీల్దార్ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను కూల్చివేసేందుకు వెళ్ళిన రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్పై కబ్జాదారుల దాడి హేయమైన చర్య అని తహశీల్దార్ సుచరిత అన్నారు. విధి నిర్వహణ ఉన్న రెవెన్యూ అధికారిపై భూకబ్జాదారులు దాడి చేయడం దుర్మార్గమని, ఇలాంటి ఘటనపై ఊరుకునేదే లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీపడేదే లేదని ఎంతటివారినైనా వదిలిపెట్టమని హెచ్చరించారు.

# పెద్దగట్టు జాతర ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



సూర్యాపేట, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా దురాజ్ పల్లిలో త్వరలో జరగనున్న పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర ఏర్పాట్లు యొక్క పరిసరాలను జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాతర యొక్క పరిసరాలను, దేవాలయ ప్రదేశాన్ని, రోడ్డు మార్గాలను, భక్తులు వేచి ఉండే స్థలాలు వాహనాల పార్కింగ్ ప్రవేశాల స్థితిగతులను ఎస్పీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరిగినదని ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లి జాతరను ప్రశాంతంగా నిర్వహిస్తామని, పెద్దగట్టు జాతర యొక్క పోలీసు బందోబస్తు కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించాలని స్థానిక పోలీస్ అధికారులకు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు తెలిపినారు. జాతీయ రహదారి వెంట వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇతర శాఖల అధికారులతో కలిసి సమన్వయంగా పని చేయాలని తెలిపారు. జాతర ప్రాంగణంలో కావాల్సిన రక్షణ ఏర్పాట్లకు సంబంధించి ప్రణాళిక రూపొందించుకోవాలని ఇతర శాఖలతో సమన్వయంతో ముందుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. బందోబస్తు ప్రణాళిక పై స్పెషల్ బ్రాంచ్ దృష్టి పెట్టి పని చేయాలని అన్నారు.అనంతరం దైవ దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రవి, సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, స్థానిక ఎస్సై మహేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

# వాగుల నీటిని సేవిస్తే వ్యాధులు నయం



ములుగు జిల్లా, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్): మంగళవారం కన్నాయిగూడెం, ఏటూరు నాగారం మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఏటూరు నాగారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ క్రూషల్ నిధుల ద్వారా అటవీ శాఖ ఏర్పాటు చేసిన బ్లాక్ బెర్రీ ఎంతో ముచ్చటగా ఉందని, పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకునే అవకాశం ఉందని అన్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలోని పలు రకాల వనమూలికలను తాకుతూ ప్రవహిస్తున్న నీటిని సేవించడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని, వ్యాధులను నయం చేయడమే కాక ఆయుష్షును పెంచుతుందని అభిప్రాయపడ్డారు. జిల్లాను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, దేశ విదేశీయుల పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తీర్చి దిద్దుతున్నామని అన్నారు. జిల్లా కేంద్రానికి ప్రవేశిస్తున్న సమయంలోనే గట్టమ్మ తల్లి ఉండడం, అక్కడి నుండి కొంత దూరం రాగానే యునెస్కో గుర్తింపు పొందిన 800 సంవత్సరాల నాటి రామప్ప ఆలయం సరస్సు పర్యాటకులను కనువిందు చేస్తున్నదని అన్నారు. రామప్పలో 70 కోట్ల రూపాయలతో కాటేజీలో ఏర్పాటుతో పాటు ఐలాండ్ నిర్మాణ పనులను పూర్తి చేస్తామని, అక్కడి నుండి కొంత దూరం రాగానే లక్నవరం సరస్సు, సరస్సులో ఉయ్యాల వంతెలతో పాటు మూడవ ఐలాండ్ ను సైతం ఇటీవలనే ప్రారంభించుకున్నామని వివరించారు. తాడువాయి మండలం మేడారం గ్రామంలోని సమ్మక్క సారలమ్మ జాతర, మల్లూరు లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం, గోదావరిపై అతిపెద్ద వంతెన, దానికి సమీపంలోనే బోగత జలపాతం లాంటి పర్యాటక ప్రాంతాలతో పాటు దైవభక్తి కలిగిన ఆలయాలు, దట్టమైన అడవి ప్రాంతాలు ఉన్నాయని అన్నారు. రానున్న రోజులలో ఏజెన్సీ గ్రామాల్లో ట్రైబల్ హట్స్ ను ఏర్పాటు చేయబోతున్నామని, జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై పాత్రికేయులు విస్తృతంగా ప్రచారం చేయాలని సీతక్క కోరారు.

# డా, చిలువేలు రాజుకుమార్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



హన్మకొండ కేయూ, డిసెంబర్ 24 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనిర్సిటీలోని హిస్టరీ అండ్ టూరిజం డిపార్ట్మెంట్ విభాగం లో మంగళవారం రోజున సెమీ క్రిస్మస్ సందర్భంగా క్రిస్మస్ వేడుకలని ఎంటీఎం విభాగంలో హెచ్ఓడి డా,, చిలువేలు రాజుకుమార్ మరియు డిపార్ట్మెంట్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థుల ఈ కార్యక్రమంలో పాల్గొని చాలా ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలని జరుపుకోవడం జరిగింది.

# గొల్ల కురుమల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి..

**– కడారి నాగరాజు యాదవ్ యాదవ సంఘం మండల నాయకులు**



గోవిందరావుపేట: గొల్ల కురుమల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యాదవ సంఘం మండల నాయకులు కడారి నాగరాజు అన్నారు. సోమవారం మండలంలోని పసర గ్రామంలో యాదవ సంఘం సభ్యులు గరుగు ఐలయ్య యాదవ్ అధ్యక్షతన యాదవ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ చేయకుండా గొల్ల కురుమలను మోసం చేసిందని. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే గొల్ల కురుమలకు. రూ రెండు లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని. తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చే సంవత్సరం గడుస్తున్నా ప్రభుత్వం హామీని నెరవేర్చకుండా గత ప్రభుత్వ విధానాన్ని అనుసరిస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే గొల్ల కురుమలకు అన్ని విధాల సహాయం అందుతుందని. ఓట్లు వేసి గెలిపిస్తే ఇప్పుడు ప్రభుత్వం గొల్ల కురుమలను చిన్నచూపు చూస్తుందన్నారు. ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో గొర్ల పంపిణీకి బదులు రెండు లక్షల నగదు బదిలీపై గొల్ల కురుమలకు స్పష్టమైన హామీ ప్రభుత్వం ప్రకటించాలని ఆయన కోరారు. అదేవిధంగా జీవాలకు వచ్చే జ్వరాలకు వ్యాధులకు గ్రామాల్లో సరైన వైద్య సౌకర్యం లేక చాలీచాలని వైద్యంతో గొర్ల కాపరులు నష్టపోతున్నారు. కనుక గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ నుండి జీవాలకు అన్ని వ్యాధులకు అవసరానికి సరిపడా వైద్యం మరియు మందులు పంపిణీ చేయాలని.

అదేవిధంగా గొర్రెల కాపరులకు ఏదైనా ప్రమాదం సంభవించినచో కాపర్లకు పది లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కడారి నాగరాజు యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో యాదవ సంఘం సభ్యులు గొర్ల శ్రీనివాస్ యాదవ్. భాషక కుమార్ యాదవ్ పయనం సీతారామరాజు యాదవ్ దాసరి సతీష్ యాదవ్ వరదం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కుల మతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలి..

**– గ్రంధాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్**

**– ముందస్తు క్రిస్మస్ వేడుకలు**



తంగళ్ళపల్లి: ఏ పండుగ వచ్చిన సరే కుల మతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పండుగలు జరుపుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ అన్నారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ఇమ్మానుయేల్ చర్చ్ లో సోమవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్నేహభావంతో పండుగలను జరుపుకోవాలని. కుల మతాల భేదాలు లేకుండా, తారతమ్యం లేకుండా, స్నేహపూ రితమైన వాతావరణంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించు కోవాలని వారు అన్నారు. సిరిసిల్ల ఏఎంసీ చైర్ పర్సన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్,మాజీ ఉప సర్పంచ్ పెద్దూరి తిరుపతి, చిన్నలింగపూర్ మాజీ ఎంపీటీసీ బేరినేని రాము, జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు మునిగెల రాజు, గుగ్గిళ్ల అభి, రెడ్డి పర్శరాములు, మండల ఫాస్టర్ల అధ్యక్షుడు గట్టు వెంకట్ రెడ్డి, చర్చ్ ఫాస్టర్ జేమ్స్ రెడ్డి, ఫాస్టర్లు నక్క ప్రేమ్, వెంకట రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

# రామన్నగూడెం ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు భూ పంపిణీ చేయాలి..

**– కలెక్టరు కార్యాలయం ముందు ధర్నా కలెక్టరు వినతి పత్రం**

**– ఇండ్ల స్థలాల లబ్ధిదారులను కాగితాలకే పరిమితం చేసి ప్లాట్లు చేయడంలో మోసం చేసిన పాలకులు**

**– ఇళ్ల స్థలాలు తక్షణమే పంపిణీ చేయాలని**

**– ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించిన పట్టించుకునే రెవెన్యూ అధికారులు**

**– సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న డిమాండ్**



నెల్లికుదురు: మండలంలోని రామన్నగూడెం గ్రామంలోని పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాల లబ్ధిదారులకు తక్షణమే భూ పంపిణీ చేసి ఇల్లు నిర్మింప చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గునిగంటి రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్టు తెలిపారు. రామన్నగూడెం ఇండ్ల స్థలాల లబ్ధిదారులతో కలిసి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ కి వినతి పత్రాన్ని అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లికుదురు మండలం రామన్నగూడెం గ్రామంలో గత 1998వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వ హాయంలో ఇళ్ల స్థలాలు లేని పేదల కోసం ప్రభుత్వం భూమిని కొనుగోలు చేయడం జరిగింది అని అన్నాడు. ఈ గ్రామంలోని 60 మంది ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు ప్రభుత్వపరంగా పట్టాలు ఇచ్చి కాగితాలకే పరిమితం చేసి ఆ భూమిని పంపిణీ చేయడంలో రెవెన్యూ అధికారులు పూర్తి విఫలం చెందారని తెలిపాడు.ఏ ప్రభుత్వం పరిపాలనకు వచ్చిన లబ్ధిదారులను మభ్యపెట్టి వారి వారి పబ్బం గడుపు కోవటం కోసం పాలకులు ఇళ్ల స్థలాల లబ్ధిదారులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చెందారు. గత అనేకసార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు లబ్ధిదారులు తమ గోడును వెళ్ళబోసుకున్న ఆ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్య వైఖరి ధోరణి అవలంబించారని అన్నారు. ఇళ్లస్థలాల భూమి ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి నా స్థానిక రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని, తక్షణమే భూ అక్రమన చేసిన వ్యక్తిని రెవెన్యూ అధికారులు తక్షణమే తొలగించాలని, ఆ భూమిని తాసిల్దారు కార్యాలయం నుంచి పొందిన పట్ట కాగితం కలిగిన ప్రతి ఒక్కరికి పంపిణీ చేసి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నెల్లికుదురు మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు నాయకులు బాబు గౌడ్ లబ్ధిదారులు నరసయ్య మైసరాములు బండి సోమయ్య సైదమ్మ జయమ్మ ప్రభాకరు పద్మ వెంకటయ్య బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కాంట్రాక్టు కార్మికుల నిరసన

**– వేతనాలు పెంచాలని డిమాండ్**

**– పర్మినెంట్ కార్మికులతో సమానంగా పని.. సౌకర్యాల్లో తేడాపై ఆవేదన**



గోదావరిఖని: సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని, ప్లకార్డ్స్ పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం ఆర్జీ-1 జీఎండి లలిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ.. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి నినాదం ఒకే కుటుంబం, ఒకే గమ్యం, ఒకే లక్ష్యం చదవడానికి బాగుంది కానీ ఇందులో కాంట్రాక్ట్ కార్మికులకు చోటులేదన్నారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ వేతనాల్లో తేడాలున్నాయని, క్వార్టర్ల కేటాయించడంలో వివక్ష ఉందని అన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజ మాన్యం కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు ఖాళీ క్వార్టర్లు కేటాయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు మేదరి సారయ్య, పి.రాజు, సిహెచ్.ఉపేందర్, ఇండ్ల ఓదెలు, నాయకులు టి.నరహరి రావు, చంద్రయ్య, కిరణ్, రాజయ్య, అంజి, వినోద, ప్రసాద్, ఖాళీ, జీన, చిలకమ్మ, శాంతి, కుమారి, లక్ష్మీ, శ్రీను, రఘు, రాజేష్, సంతోష్ పాల్గొన్నారు.

# హామీలను వెంటనే అమలు చేయాలి..



మునుగోడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుబండ శ్రీశైలం అన్నారు. మంగళవారం మునుగోడు మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో మండల కమిటీ సమావేశం వరికుప్పల ముత్యాలు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంఎన్నికల ముందురైతు రుణమాఫీ, రైతు భరోసా, పూర్తిగా రైతు ఖాతాలోజమ చేయాలని, పెండింగ్ లో ఉన్న రుణమాఫీ, రైతు భరోసా సమస్యలను పరిష్కరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతాంగానికి వ్యవసాయ పెట్టుబడులకు రైతులకు ఇచ్చే ప్రోత్సాహం మూడు పంటలకు ఇవ్వాల్సిన పెట్టుబడులు ఇవ్వకపోవడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆయన అన్నారు. బ్యాంకులలో రైతులకు అప్పులు ఉన్నటువంటి వారందరికీ రుణమాఫీ చేయకపోవడం వలన రైతులకు వడ్డీ భారంగా మారుతుందన్నారు. రుణమాఫీ డబ్బులు రైతు ఖాతాలో జమ చేయకపోవడం వలన బ్యాంకర్లు తిరిగి పంట రుణాలు ఇచ్చే దగ్గర రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంఎన్నికల ముందు ప్రకటించినరైతు రుణమాఫీ, రైతు భరోసాఇవ్వాలని అన్నారు. రుణమాఫీ కానటువంటి రైతులందరికీ రుణమాఫీ చేయాలని, రైతులు ఎంతైతే రుణమాఫీ అయిందో అంత పంట రుణం తిరిగి చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయ పెట్టుబడులకు రెండు పంటలకు రైతు భరోసా, రైతులందరికీరైతు ఖాతాలలో జమ చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మునుగోడు మండల కార్యదర్శిసాగర్ల మల్లేష్, మండల కమిటీ సభ్యులు యాసరాణి శ్రీను, వరికుప్పల ముత్యాలు, వేముల లింగస్వామి, కట్ట లింగస్వామి, శివర్ల వీరమల్లు, వడ్లమూడి హనుమయ్య, కొంక రాజయ్య, పగడాల కాంతయ్య, పగిళ్ల మధు, పగిళ్ల యాదయ్య, సిహెచ్ బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# సంయుక్త కిసాన్ మోర్చా కలెక్టరేట్ వద్ద ధర్నా..

**– రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యాన్ని కాపాడాలి..**




భువనగిరి కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కొల్లు రాజయ్య అధ్యక్షతన జరిగిన సభలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్, కొల్లు రాజయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతీసుకు వచ్చిన నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని విరమించుకోవాలని కోరారు. కిసాన్ మోర్చా అఖిలభారత నాయకుడు జగజీత్ సింగ్ దల్లేవాల్ నిరాహార దీక్షను ఆయనతో కేంద్ర ప్రభుత్వము చర్చలు జరిపి విరమింపజేయాలని, ఆందోళన చేస్తున్న కిసాన్ మోర్చా 120 మంది నాయకులపై పెట్టిన అక్రమ కేసులని ఎత్తివేయాలని నోయిడా లోనిర్బంధించిన రైతు ఉద్యమ నాయకులను నోయిడా లక్సార్ జైలు నుండి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పండించిన పంటలకు కనీస మద్దతు ధరల చట్టాన్ని పార్లమెంటులో వెంటనే తేవాలని పంజాబ్ సరిహద్దులో రైతుల పోరాటంపై అణచివేతను ఆపాలని, రైతు సంఘాలతో తక్షణమే చర్చలు జరపాలని కోరారు. అనంతరం ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు మామిడాల బిక్షపతి, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు జనార్ధన్, కేమిడి ఉప్పలయ్య సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దాసరి పాండు మాట్లాడుతూ తీసుకొచ్చిన నూతన వ్యవసాయ మార్కెట్ విధానం దేశ ప్రజలకు హానికరమైనదని రైతాంగాన్ని నిలువుదపిడి చేసేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. నరేంద్ర మోడి రెండు సంవత్సరాల క్రితం దేశ ప్రజలకు , రైతులకు క్షమాపణలు చెప్పి మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారని-కానీ దొడ్డిదారిన మళ్లీ ఆ నల్ల చట్టాలను తీసుకువచ్చే చర్యలను రైతాంగం ప్రతికటించాలని పిలుపునిచ్చారు రైతు ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా రైతులకు ఇచ్చిన హామీలు అమలుచేసి రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతుల ఆత్మ హత్యలని నివారించాలని, రైతుఉద్యమంలో చనిపోయిన కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు అనంతరం జిల్లా కలెక్టర్ హనుమంతరావుకు రైతు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించి ,రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కి పంపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి కల్లెపుఆడవయ్యా,నమిలే అంజి బాబు ,జర్క దయాకర్ రెడ్డి, పైల యాదిరెడ్డి, ఏషాల అశోక్ ,గూడూరు అంజిరెడ్డి, ఆంజనేయులు, రాజయ్య, రేకల శ్రీశైలం,మచ్చ భాస్కర్, తుమ్మల సత్యనారాయణ రెడ్డి , పాండాల మైసయ్య, బోనగిరి స్వామి, మల్లేశం, గుంటిపల్లి, సత్తయ్య, రామ్ నరసయ్య సోమన్న, కొమురయ్య, నరసింహా రెడ్డి లు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**– కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జయవీర్**



పెద్దవూర: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రజా పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెలుతుందని నాగార్జున సాగర్ శాసన సభ్యులు కుందూరు జయివీర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమానికి హాజరై 116 మంది లబ్ధిదారులుకు చెక్కులు పంపిణి చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వలక్ష్యంగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు.ముఖ్యంగా రైతులకు ఇప్పటికే రెండు లక్షల వరకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందని అన్నారు. సంక్రాతి పండుగనుంచి రైతుభరోసా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.రైతుబీమా, పంటల బీమా పథకాలతో రైతన్నలను ఆదుకుంటుందన్నారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేస్తుందని అన్నారు.మండల కాంగ్రెస్ అధ్యక్షులు పబ్బు యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మెన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ ఛైర్మెన్ తుమ్మల పల్లి చంద్ర శేఖర్ రెడ్డి, పిఏసీఎస్ ఛైర్మెన్ గుంటుక వెంకట్ రెడ్డి, తహసీల్దార్ సరోజ పావని,ఆర్ఐ దండా శ్రీనివాస్ రెడ్డి,ఎంపీఓ, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షులు పగడాల నాగరాజు, ఉంగరాల శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ పూరే వెంకన్న, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రేపాకుల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రేపాకుల సాయి కుమార్, యూత్ కాంగ్రెస్ మాజీ మండల యూత్ అధ్యక్షులు కిలారీ మురళీ కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్ సెట్ కన్వీనర్ గా ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్లను నియమించాలి..

**– ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్ మూర్తి..**





ఓయూ: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎడ్ సెట్ కన్వీనర్ గా ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ ను మాత్రమే నియమించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఓయూ లో సోమవారం ఆర్ట్స్ కళాశాల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎల్ మూర్తి మాట్లాడుతూ. అన్ని సెట్ల కన్వీనర్లను సంబంధించిన డిపార్ట్మెంట్ వారికి మాత్రమే కేటాయించి ఎడ్ సెట్ మరియు ఫిజికల్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్లను పరిగణలోకి తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా సంబంధం లేని వారిని నియమించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి నిర్ణాయక అంశాల్లో ఉన్నత విద్యా మండలి జాగ్రత్త వహించాలని వెంటనే తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని అనుభవజ్ఞుల ను సంబధిత శాఖ కు సంబంధించిన ప్రొఫెసర్లను నియమించాలని లేదంటే ఉన్నత విద్యా మండలిని ఎస్ఎఫ్ఐ ముట్టడిస్తుందని పేర్కొన్నారు.ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్షులు కలకోటి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన నియామకాల్లో ఆయా రంగాల్లో విషయ నైపుణ్యం కలిగిన వారిని నియమించడమే సరైనదని, నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్స్, బీఎడ్, ఎంఎడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# అమిత్ షా రాజీనామా చేయాలి

**– అంబేద్కర్‌పై వ్యాఖ్యలతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల గుండెల్లో గాయం : దీపాదాస్ మున్షి**




హైదరాబాద్: బీజేపీ నాయకులు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తదితర నాయకులతో కలిసి ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆ వ్యాఖ్యలతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల గుండెల్లో గాయమైందన్నారు. ఇది కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల విషయం కాదనీ, ఆ వర్గాలు అంబేద్కర్‌ను దేవుడిగా భావిస్తున్నాయని చెప్పారు. తక్షణం అమిత్ షా రాజీనామా చేసి ప్రజలను క్షమాపణ కోరాలన్నారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా 'అంబేద్కర్ సమ్మాన్ సప్తాహ" నిర్వహిస్తున్నాం. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్‌లో, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి, అమిత్ షాని బర్తరఫ్ చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్లను కలుస్తామని చెప్పారు. బీజేపీ రాజ్యాంగాన్ని తొలగించాలనుకుంటున్నదని అమిత్ షా వ్యాఖ్యలతో మరోసారి బట్టబయలైందని విమర్శించారు. అవినీతిపై చర్చించమంటే దారి మళ్లించేలా ఇలాంటి అంశాలు మాట్లాడుతున్నారని తెలిపారు. దేశమంతటా తల మీద మానవ వ్యర్థాలు మోసే విధానం పోవాలని కోరుతుంటే 2010లో సామాజిక్ సంరస్థ పుస్తకంలో ఆ విధానం కొనసాగాలని పీఎం నరేంద్రమోడీ రాశారని ఆరోపించారు. అందులో ఎస్సీలను మానసిక వికలాంగులుగా అభివర్ణించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక సమానతను కోరిన అంబేద్కర్‌ను క్రాంతికిరణ్ కాదంటూ పేర్కొన్నారని తెలిపారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై తాము నిలదీస్తే అదంతా రాజకీయమంటూ తప్పించుకున్నారని రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనలను గుర్తుచేశారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. కేంద్ర క్యాబినెట్ నుంచి అమిత్ షాను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంటు అత్యున్నత వ్యవస్థ అని తెలిపారు. రాహుల్ గాంధీ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా హత్యాయత్నం కేసు నమోదు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడబ్ల్యూసీ సభ్యులు కొప్పుల రాజు మాట్లాడుతూ దేశ పౌరులు అంబేద్కర్‌ను దేవునిగా చూస్తుంటే ఆ దేవునిపై అమిత్ షా ద్వేషంతో మాట్లాడారని విమర్శించారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందంటూ ప్రధాని మోడీ చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. అంబేద్కర్‌ను డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మెన్‌గా ఎన్నుకున్నది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ చేసిన రాజ్యాంగ సవరణలు పేద ప్రజలకు ఉపయోగపడ్డాయని తెలిపారు.

# రికమెండేషన్లకు గుడ్ బై టాలెంట్ ఉంటే చాలు ఉద్యోగం

హైదరాబాద్: రికమెండేషన్లకు తలొగ్గకుండా ప్రతిభ కలిగిన వారికే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా 71వేల మందికి నియామక పత్రాలు అందజేస్తున్నామని చెప్పారు. చాంద్రాయణగుట్ట సీఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్ లో రోజ్ గార్ మేళా కార్యక్రమాన్ని కిషన్ రెడ్డి ప్రారంభించారు. పూర్తి పారదర్శక విధానంలో ఉద్యోగాలు కల్పిస్తున్నామని, దళారుల మాట విని మోసపోవద్దని సూచించారు. కేంద్ర ఉద్యోగాలకు ఎంపికైన 526 మందికి ఆయన నియామక పత్రాలు అందజేశారు. నియామక పత్రాలు అందజేసిన సందర్భంగా మాట్లాడిన కిషన్ రెడ్డి.. ఇప్పటివరకు 10 రోజ్ గారి మేళాలు పూర్తయ్యాయని, ఇది 11వ మేళా అని చెప్పారు. ఈ కార్యక్రమంతో సుమారుగా 10లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. ప్రతి నెల ఉద్యోగ నియామకాలు జరగాలని, ఖాళీలు ఉండొద్దని ప్రధాని ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. గతంలో ఉద్యోగ నియామకాల్లో అవినీతి జరిగేదని, కానీ ఇప్పుడు మాత్రం పూర్తి పారదర్శకంగా నియామకాలు జరుగుతున్నాయని కిషన్ రెడ్డి అన్నారు. కరోనా మహమ్మారితో చాలా దేశాలు ఆర్థికంగా ఎంతో నష్టపోయాయని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ప్రస్తుతం మన దేశంలో తయారవుతోన్న మొబైల్ ఫోన్లు అభివృద్ధి చెందిన దేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయన్నారు. దేశంలో 5జీ సేవలు రెట్టింపవుతున్నాయని, కానీ ఇప్పటికీ చాలా దేశాల్లో 5జీ లేదని చెప్పారు. అతి తక్కువ ఖర్చుతో నెట్ సేవలు అందిస్తోన్న దేశం మన దేశమని కొనియాడారు. మన దేశ యువత అతి తొందర్లోనే ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అంతకుముందు టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడిని కిషన్ రెడ్డి ఖండించారు. ఈ ఘటనపై ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నటుడు అల్లు అర్జున్ నివాసంపై జరిగిన రాళ్ల దాడి ఘటన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శాంతి, భద్రతల వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది. ఈ ఘటన పౌరుల భద్రత, శాంతి భద్రతలను రక్షించడంలో కాంగ్రెస్ అసమర్థ పాలనను ప్రతిబింబిస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కళాకారులను, సినీ పరిశ్రమను టార్గెట్ చేయడం ప్రమాదకరమైన ఆనవాయితీగా మారిందని విమర్శలు గుప్పించారు. ఈ ఘటన కాంగ్రెస్ కు మద్దతుగా జరిగిందా లేదంటే.. స్పాన్సర్డ్ గా జరిగిందా అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

# సింగరేణి యువ బలగం ఆధ్వర్యంలో ఉచిత షుగర్ పరీక్షలు

**సేవా కార్యక్రమలు చేయడం చాలా అభినందనియం**

**–ఏస్ ఓ టు జీఎం రఘుపతి**




కమాన్ పూర్: సింగరేణి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సింగరేణి యువబలగం రామగుండం రీజియన్ వారి ఆధ్వర్యంలో సెంటినరీ కాలనీలోని రాణి రుద్రమదేవి మైదానం నందు ఉదయం 7గంటలకు ప్రకృతి వైద్య నిపుణురాలు డాక్టర్ శరణ్య గారిచే దాదాపు వంద మందికి ఉచితంగా షుగర్ పరీక్షలు చేసి వారికి ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అర్జీ త్రీ ఏరియా ఎస్ ఓ టు జిఎం రఘుపతి మాట్లాడుతూ సింగరేణి లో పనిచేసే యువ కార్మికులు అటు రక్షణ కూడిన ఉత్పత్తి లో కృషి చేయడంతో పాటు, సామాజిక బాధ్యతగా కార్మికులు అంత ఒక బృందంగా ఏర్పడి ప్రతి నెల ఒక వంద రూపాయలు జామచేస్తూ వచ్చిన మొత్తమును సేవ కార్యక్రమాలకు ఉపయోగించడం చాలా సంతోషకరమైన విషయము అని, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శరణ్య గారిని అభినందిస్తూ, సింగరేణి యువ బలగం టీం సభ్యులు గతంలో నిరుపేద కుటుంబానికి నిత్యవసరవస్తువులు, ఒక కాంట్రాక్టు కార్మికుడికి వైద్య ఖర్చులు నిమిత్తం సహాయం చేయడం, అలాగే ఇటీవల నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి చనిపోతే వారి కుటుంబానికి కొంత ఆర్థిక సహాయం చేయడం జరిగిందని ఇలాంటి మంచి కార్యక్రమాలను భవిష్యత్తులో ఈ యొక్క బృందం సంఖ్య పెరిగి ఇంకా ఉన్నతమైన సేవ కార్యక్రమాలు చేయాలని సింగరేణి యువ బలగం టీం సభ్యులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని, ఈ యె?క్క బృందానికి మా యొక్క సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, సురేష్,సంతోష్, శేషీ కుమార్, మారుతి,బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గతేడాది కంటే పెరిగిన సైబర్ నేరాలు

**– ఈ ఏడాది 1,14,000 వేల కేసులు నమోదు**

**– దేశంలోనే సైబర్ నేరాల దర్యాప్తులో ఐదోస్థానం**

**– ప్రజల్లో ఈ నేరాలపై మరింత అవగాహన పెంచుతాం : సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీపీ శిఖా గోయెల్**



హైదరాబాద్: రాష్ట్రంలో సైబర్ నేరాలను తగ్గించడానికి తాము చేస్తున్న కృషికి మంచి ఫలితాలు లభిస్తున్నాయనీ, అయినప్పటికీ గతేడాదితో పోలిస్తే ఈసారి సైబర్ నేరాలు పెరిగాయని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీపీ శిఖా గోయెల్ తెలిపారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో సైబర్ నేరాలపై వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎస్‌బీకి చెందిన ఏడు పోలీసు స్టేషన్లతో పాటు హెడ్‌క్వార్టర్స్ లో ఉన్న ప్రధాన కార్యాలయం ద్వారా సైబర్ నేరాల నివారణకు తీసుకున్న అనేక చర్యలు ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. గతేడాది 94 వేలకుపైగా సైబర్ నేరాలు జరగ్గా.. ఈ ఏడాది ఇప్పటివరకూ 1,14,000కుపైగా నమోద య్యాయని తెలిపారు. ఈ నేరాల్లో రాష్ట్రానికి చెందిన వారే కాకుండా ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి కూడా నేరస్తులు రాష్ట్రాన్ని టార్గెట్ చేశారని వివరించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా నగదు మార్పిడి నేరాలు ఎక్కువగా చోటుచేసుకు న్నాయనీ, అందులో ప్రయివేటు ఏజెంట్లతో పాటు కొందరు అకౌంట్ దారులు కూడా పాత్ర వహించారని తెలిపారు. వారికి లభించే కమీషన్‌కు ఆశపడి బ్యాకాంక్, దుబారు దేశాల్లో ఉన్న నేరస్తులకు వారు సహాయపడ్డారని ఆమె తెలిపారు. వారేగాక రాజస్థాన్, ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఉన్న సైబర్ నేరస్తులు సైతం ఆన్‌లైన్ మోసాల ద్వారా కోట్ల రూపాయ లలో బాధితులను మోసగించారని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటివరకూ 244 కోట్ల రూపాయ లకుపైగా సైబర్ నేరస్తులు బాధితులను మోసగించి దండుకున్నారని వివరించారు. అందులో దాదాపు 17 వేల మందికిపైగా బాధితులకు సంబంధించి 176 కోట్ల రూపాయలకుపైగా డబ్బులను బాధితులకు వాపస్ చేశామని తెలిపారు. 196 మంది సైబర్ నేరస్తులను అరెస్టు చేశామన్నారు. ముఖ్యంగా రాజస్థాన్‌లోని జోథ్‌పూర్, జైపూర్‌లలో రాష్ట్రానికి సీఎస్‌బీ ప్రత్యేక టీమ్‌లు దాడులు జరిపి పెద్ద సంఖ్యలోనే సైబర్ నేరస్తులను అరెస్టు చేశాయని వివరించారు. తాజాగా, 21 మంది సైబర్ నేరస్తులను అరెస్టు చేశామనీ, అందులో 13 మంది బ్యాంకుల అకౌంట్‌దారులు, మిగతా 8 మంది సైబర్ నేరస్తుల ఏజెంట్లు ఉన్నారని ఆమె తెలిపారు. వారు హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్, జగిత్యాల, తదితర ప్రాంతాలకు చెందిన వారిని మోసగించి బాధితుల బ్యాంకు అకౌంట్ల నుంచి లక్షల రూపాయలను మళ్లించుకున్నారని వివరించారు. మొత్తం మీద దేశవ్యాప్తంగా సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రగతిని సాధించిన ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని ఆమె తెలిపారు.

# సెల్ టవర్ ఎక్కి ఆటో డ్రైవర్ హల్‌చల్

**– పోలీసులు తనకు న్యాయం చేయాలని డిమాండ్**



కట్టంగూర్: తనపై అకారణంగా దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ ఓ ఆటో డ్రైవర్ సెల్ టవర్ ఎక్కి రెండు గంటల పాటు హల్‌చల్ చేశాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని అయిటిపాముల గ్రామశివారులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన చిలుముల చింతాలు ఆటో డ్రైవర్. నాలుగు రోజుల కిందట తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని నకిరేకల్ వెళ్తుండగా పట్టణంలో కొంత మంది వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అదే రోజు చింతాలు నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నాలుగు రోజులైనా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో ఆవేదన చెందిన చింతాలు.. అయిటిపాముల గ్రామశివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. విషయం తెలుసుకున్న కట్టంగూర్ ఎస్ఐ రవీందర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని నచ్చజెప్పడంతో కిందికి దిగాడు. చింతాలును నకిరేకల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

# 30లోపు ఇందిరమ్మ అర్హుల ఎంపిక

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు సర్వే కొనసాగుతోంది. ఈనెల 30వ తేదీలోపు పూర్తయ్యే అవకాశం ఉంది. ఆ వెంటనే లబ్ధిదారులను గురిస్తామని గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ప్రతి మండలంలో మోడల్ హౌజ్ నిర్మాణం చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం చాలా మంది ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే లక్షల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రభుత్వం యాప్ సర్వే చేస్తోంది. ఈనెలాఖారు నాటికి సర్వే పూర్తి చేయాలని సర్కార్ భావిస్తోంది. ఇందుకు డెడ్ లైన్ కూడా విధించింది. యాప్ సర్వే పూర్తి అయిన వెంటనే లబ్ధిదారులను గుర్తిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మోడల్ ను ప్రతి మండలంలో కడుతున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించిన మంత్రి పొంగులేటి? కల్లూరు మండలంలో ఇందిరమ్మ మోడల్ ఇండ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ? రాబోయే నాలుగు ఏళ్లలో 20 లక్షల ఇళ్లకు తగ్గకుండా కట్టాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకొచ్చారు. ప్రజాపాలనలో 1 కోటి ఐదు లక్షల అప్లికేషన్ వస్తే ఇళ్ల కోసంమే ఎనభై లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని పొంగులేటి పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తుదాడి ఇంటికి వెళ్లి అధికారులు సర్వే చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కండిషన్లు ఏమీ లేవని? పేదవాడై అర్హత ఉంటే ఇస్తామన్నారు. నాలుగు విడతల్లో ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తామని చెప్పారు. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి? వారి ఇంటి వద్దకు వెళ్తున్నారు. సర్వేకు ఒక రోజు ముందే దరఖాస్తుదారుడికి సమాచారం ఇస్తున్నారు. ప్రతి దరఖాస్తును క్షుప్తంగా పరిశీలించి? వివరాలను సేకరిస్తున్నారు. అయితే కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని అధిగమిస్తూ అధికారులు సర్వే చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 80,54,554 దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రతి 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్‌ను ఏర్పాటు చేశారు. ఒక సర్వేయర్ రోజుకు కనీసం 20 దరఖాస్తులను సర్వే చేయాలని టార్గెట్‌గా పెట్టారు. సర్కార్ లక్ష్యానికి అనుగుణంగా? అధికారులు పని చేస్తున్నారు. మొదటి విడతలో సొంత స్థలం ఉన్న నిరు పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనుంది. అయితే ఈనెలాఖారులోపు సర్వే పూర్తి కాకపోతే? జనవరి మొదటి వారంలోపైనా పూర్తయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. సర్వేలో భాగంగా? దరఖాస్తుదాడి ఫొటోతో పాటు ఖాళీ స్థలం, ప్రస్తుతం ఉంటున్న ఇంటి చిత్రాలను కూడా యాప్లో అప్ లోడ్ చేస్తున్నారు.

# భగీరథకు టోల్ ఫ్రీ

**– తాగునీటి సమస్యలపై 1800-599-4007 నెంబరుకు కాల్ చేయండి**

**– తొలిరోజు తొమ్మిది ఫిర్యాదులు**

హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి సర్కారు ముందడుగేసింది. వేసవికి మూడు నెలల ముందుగా స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే ప్రయత్నం చేస్తున్న పంచాయతీరాజ్ శాఖ, తాజాగా టోల్‌ఫ్రీ నెంబరును కేటాయించింది. పల్లెల్లో తాగునీటి ఇబ్బందులు ఉంటే 1800-599-4007 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించింది. ఇందుకుగాను ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఎస్ఈ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందాన్ని పర్యవేక్షణ కోసం నియమించింది. సోమవారం నుంచే ఈ టోల్ ఫ్రీ నెంబరు అమల్లోకి వచ్చింది. తొలి రోజు ఆయా జిల్లాల నుంచి తొమ్మిది ఫిర్యాదులు అందాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులు, సమస్యలపై ఎప్పటికప్పుడు సర్కారు దృష్టికి తీసుకుపోయే అవకాశం కలిగింది. 24గంటల పాటు కాల్ సెంటర్ పనిచేయనుంది. పగటిపూట వచ్చే ఫోన్ కాల్స్‌ను భగీరథ కార్యాలయం సిబ్బంది అటెండ్ చేసి వివరాలు నమోదు చేసుకుంటారు. ప్రతిరోజూ వచ్చే ఫిర్యాదులను మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ కపాకర్‌రెడ్డి సమీక్షించి 24 గంటల్లో సమస్య పరిష్కారమ య్యేలా చర్యలు తీసుకుం టారు. టోల్ ఫ్రీ ద్వారా అందే ఫిర్యాదులను క్షేత్ర స్థాయికి చేరవేసి పరిష్కారానికి అవసరమైన సలహాలు, సూచనలు చేస్తారు. అంతేగాక రాష్ట్ర కార్యాలయం సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉంటారు. పంచాయతీరాజ్, మిషన్ భగీరథ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సైతం పలుమార్లు సమీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అనంతరమే టోల్‌ఫ్రీ ఆలోచ న చేసినట్టు మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపా యి. మిషన్ భగీరథ నీటిపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టను న్నారు. నీటి సరఫరాలో లీకేజీలు, ఆటంకాలను అరికట్టే లక్ష్యంగా టోల్‌ఫ్రీని ఏర్పాటు చేశారు. ఫిర్యాదుల స్వభావం ఆధారంగా కీలక నిర్ణయా లు తీసుకునే అవకాశం కనిపిస్తున్నది. తాగునీటి సరఫరా సజావుగా సాగేలా చూసేందుకు గ్రామాల్లో మంచినీటి సహాయకుల నియామకం చేయనున్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా తక్షణం రంగంలోకి దిగి మరమ్మతులు చేసేలా సహాయకులకు పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వనున్నారు. మిషన్ భగీరథ సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకు సైతం ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. 64,218 చేతి పంపులు, 45,882 సింగిల్ ఫేజ్ మోటార్లు, 32,517 పైపులకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవడానికి మిషన్ భగీరథ శాఖ కృషి చేస్తున్నది. తాజాగా మిషన్ భగీరథలో కాల్‌సెంటర్ ఏర్పాటుతో గ్రామీణ నీటిసరఫరా సమస్యలకు చెక్ పడే అవకాశాలు ఉన్నాయి.

# పుస్తకాలంటే నాగరికతను భవిష్యత్‌కు అందించేవి

**– బుక్ ఫెయిర్ వాక్‌లో వక్తలు**




ముషీరాబాద్: పుస్తకాలంటే నాగరికతను భవిష్యత్ తరాలకు అందించేవని వక్తలు అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో 'పుస్తక నడక స్కూల్ కార్యక్రమం' శ్రీసాయి రామ్ హైస్కూల్ (బండమైసమ్మ నగర్) పిల్లలతో ఘనంగా సాగింది. లోయర్ ట్యాంక్ బండ్ నుంచి బుక్ ఫెయిర్ ప్రాంగణం వరకు ఈ నడక కొనసాగింది. ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బుక్ ఫెయిర్‌లో సభ నిర్వహించారు. ఈ సభలో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మెన్ అల్లం నారాయణ, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, విజరుకుమార్, ఐజీ రమేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొని ఈ కార్యక్రమానికి ఊపిరి పోశారన్నారు. వారి యాజమాన్యం కపాల సిద్ధార్థకు ధన్యవాదాలు తెలిపారు. పుస్తకాలు చదివేవారు తగ్గిపోతున్నారని.. అందుకే పుస్తకాలను చదవండి అని ప్రత్యేకంగా నినాదం ఇస్తున్నామని అన్నారు. అయితే, హైదరాబాద్ బుక్ ఫెయిర్ వంటి కార్యక్రమాలతో ఆ ఆందోళన తగ్గుతోందన్నారు. నేడు యువకులు కూడా సాధారణంగా సభలకు సమావేశాలకు, పుస్తకాలతో సంబంధం ఉన్న కార్యక్రమాలకు పెద్దలతో కలిసి వస్తున్నారని, పుస్తకాలు రాస్తున్నారని అన్నారు. మన జీవితంలో మొబైల్ ఫోన్ల వల్ల చదివే అలవాటును కోల్పోతున్నామని, అందువల్ల దాన్ని బ్యాలెన్సింగ్ చేసుకోవాలన్నారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మెన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. అనేక రకాల ఆలోచనలు, ఉద్వేగపరిచే కవిత్వాలను, రకరకాల దృక్పథాలను ఒక దగ్గర చేర్చే ఏకైక కూడలి పుస్తకం అన్నారు. పుస్తకం మాత్రమే జ్ఞానాన్ని అందిస్తుందన్నారు.

ఐజీ.రమేష్ మాట్లాడుతూ.. తాను ఫోన్లు వాడటం తగ్గించి, పుస్తకాలు చదవడం ప్రారంభించానన్నారు. పనికిరాని వాట్సాప్ గ్రూపుల నుంచి బయటపడి సమయాన్ని పుస్తకాలకు కేటాయిస్తున్నానని, మూడు పుస్తకాలు కొన్నానని తెలిపారు. మొదటి రోజే పుస్తకం పూర్తి చేశానని, దాదాపు 23 ఏండ్ల తర్వాత ఇలా చదవడం ఎంతో అనుభూతిని ఇచ్చిందన్నారు. అనంతరం గ్రంథాలయ చైర్మెన్ రియాజ్ మాట్లాడారు. లైబ్రరీల్లో పుస్తకాలు చదివే వారి సంఖ్య పెరుగుతోందన్నారు. తెలంగాణలో లైబ్రరీలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఎమెస్కో విజరు కుమార్ మాట్లాడుతూ.. పుస్తకాలు చదివే అలవాటును పెంచేందుకు ప్రపంచ వ్యాప్తంగా పుస్తక మహోత్సవాలు ఎంతో ఉపయోగ పడుతున్నాయన్నారు. పుస్తక పఠనంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రాధాన్యం గొప్పదని, 37 ఏండ్లుగా ఈ పుస్తక ప్రదర్శన ఎంతో ప్రతిష్ఠాత్మకతను సాధించుకుందని తెలిపారు. ఆ తర్వాత ఆనందాచారి మాట్లాడారు. అనంతరం వారిని బుక్‌ఫెయిర్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో బుక్‌ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్, సెక్రటరీ వాసు, వైస్ ప్రెసిడెంట్ బాల్‌రెడ్డి, శోభన్ బాబు, ట్రెజరరీ నారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ చానల్స్ జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు

## ఆగాలంటే డిజిటల్ జర్నలిస్టులు ఏకం కావాలి



హైదరాబాద్, డిజిటల్ చానల్స్ స్వతంత్ర గొంతు లపై దాడులు అక్రమ కేసులు పెరుగుతున్న సందర్భంగా ప్రభుత్వం నుండి అందవలసిన అక్రెడిషన్స్ హెల్త్ కార్డులు ఇంటి స్థలాల లాంటి కనీస హక్కులను డిజిటల్ జర్నలిస్టులను దూరం పెడుతున్నారని ముఖ్య ఉద్దేశంతో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సుందర్ భాను ల అధ్యక్షతన డిజిటల్ చానల్స్ జర్నలిస్ట్ మీట్ అనే కార్యక్రమం ఏర్పాటు చేసి రౌండ్ టేబుల్ కార్యక్రమాన్ని డిజిటల్ చానల్స్ సీఈవోలు జర్నలిస్టులు పాల్గొని మన సమస్యలపై హక్కుల కోసం గొంతు కలుపుదామని రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు.

డిజిటల్ జర్నలిస్టుల డిమాండ్లు

డిజిటల్ మీడియా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని రక్షణ కల్పించాలని న్యూస్ అనాలసిస్ అందిస్తున్న డిజిటల్ చానల్స్ ఈ పేపర్స్ ను మీడియా గా గుర్తించాలని డిజిటల్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు హెల్త్ కార్డులు ఇవ్వాలని డిజిటల్ మీడియా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వ డిపార్ట్మెంట్ల ప్రకటనలు డిజిటల్ మీడియాకు కూడా ఇవ్వాలని యూట్యూబ్ ఛానల్స్ అక్రిడేషన్ జీవోను సవరించాలని ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డిజిటల్ చానల్స్ భవిష్యత్తు కార్యాచరణ పై చర్చ....

డిజిటల్ జర్నలిస్టుల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని దాడులకు కేసులకు గురైన వారికి లీగల్ సర్వీలు అందించాలని దీనికోసం లీగల్ టీం ను ఏర్పాటు చేసుకోవాలని స్కిల్స్ టెక్నాలజీ వర్క్ షాపులు నిర్వహించుకోవాలని డిజిటల్ చానల్స్ కు వస్తున్న థర్డ్ పార్టీ క్లెయిమ్స్ మానిటైజేషన్ పై అవగాహన కల్పించాలని దానికోసం సహరించి కోవాలని చానల్స్ స్వతంత్రతను కాపాడుకోవాలని ఈ సమావేశంలో చర్చించుకోవడం జరిగింది అనంతరం డిజిటల్ చానల్స్ మరియు జర్నలిస్టుల నూతన కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలిండియా వెబ్ ఛానల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ .ఇన్వెన్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె తిరుపతిరెడ్డి. వివిధ డిజిటల్ న్యూస్ ఛానల్ సీఈఓ లు జర్నలిస్టులు దాదాపు 50 డిజిటల్ చానల్స్ ప్రతినిధులు తదితరులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు.

# రాజయ్యకు కలిసి రాని కాలం


వరంగల్: తొలి తెలంగాణ ఉప ముఖ్యమంత్రిగా పని చేసిన తాటికొండ రాజయ్య రాజకీయ ప్రస్థానం ప్రశ్నార్థకంగా మారిందంట ఇప్పుడు. బీఆర్ఎస్ పార్టీపై అన్ని వర్గాల నుండి వ్యతిరేకత వ్యక్తం అవుతుండడం ప్రతిపక్ష పాత్రను సైతం దీటుగా పోషించ లేకపోతుండటంతో రాబోయే రోజుల్లో ఆ పార్టీ మనుగడ అసాధ్యమన్న చర్చ జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో తాను గులాబీ పార్టీలో ఉంటే రాజకీయ భవిష్యత్తు క్లోజ్ అయినట్టేనని భావిస్తున్నారట తాటికొండ రాజయ్య.ఈ పరిస్థితులను ముందే ఊహించిన రాజయ్య ఎంపీ ఎన్నికల ముందు హస్తం పార్టీలోకి వెళ్లేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేశారంట. కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది నాయకులు తీవ్రంగా అడ్డుచెప్పడంతో హస్తం పార్టీలోకి రాజయ్య ఎంట్రీ ఆగిపోయిందన్న టాక్ వినిపిస్తుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రాజయ్య, కడియం శ్రీహరి మధ్య పొలిటికల్ వార్ నడిచింది. ఇద్దరూ బీఆర్ఎస్‌లోనే ఉన్నప్పటికీ టికెట్ రేసులో ఇద్దరూ ఒకరితో ఒకరు పోటీ పడ్డారు. చివరకు కడియం శ్రీహరి టికెట్ దక్కించుకొని ఎన్నికల్లో గెలిచారు.తాటికొండ రాజయ్యకు టికెట్ వచ్చే అవకాశం లేదని, అసెంబ్లీ ఎన్నికలకు ముందే పార్టీ మారాలని వరంగల్ జిల్లాకు చెందిన ఓ సీనియర్ బీఆర్ఎస్ నేత సలహా ఇచ్చారట. అప్పుడే పార్టీ మారి ఉంటే కాంగ్రెస్ నుండి టికెట్ కచ్చితంగా వచ్చేదని, ఎన్నికల్లో గెలుపు సునాయసంగా దక్కేదని ఆయన అనుచరులు వాపోతున్నారు. ఎంపీ ఎన్నికల ముందు తాటికొండ రాజయ్య హస్తం పార్టీలో చేరేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు.

కానీ, అప్పటికే కడియం శ్రీహరి గులాబీ పార్టీ వీడేందుకు సిద్ధమవుతున్నారనే లీకులు రావడం, ఘనపూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నేతలు సైతం అడ్డుచెప్పడంతో రాజయ్య ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి. చేసేది లేక బీఆర్ఎస్ పార్టీలోనే ఉండేందుకు నిశ్చయించుకున్నారు రాజయ్య.అయితే రాజయ్యను పార్టీ నుండి వెళ్లగొట్టేందుకు వరంగల్ లోని కొంతమంది బీఆర్ఎస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారట. పార్టీ కార్యక్రమాలకు పిలవకపోవడం, ఒకవేళ పిలిచినా తగిన గౌరవం ఇవ్వట్లేదని తీవ్ర అసంతృప్తిలో ఉన్నారట రాజయ్య. ఎస్సీ వర్గీకరణ అంశంపై పోరాటానికి సిద్ధమైన రాజయ్య, బీఆర్ఎస్ పార్టీ మాజీలను ఆహ్వానిస్తే తాము రామని తిరస్కరించారట. ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన తనను పక్క పార్టీలే కాదు, సొంత పార్టీ నేతలు కూడా రాజకీయంగా తొక్కేయాలని చూస్తుండటంతో రాజయ్య ఏం చేయాలో తెలియక మథనపడుతున్నారట.ఓ వైపు టికెట్ రేసులో ఓడిపోయి ప్రజలకు దూరమైన రాజయ్య పొలిటికల్ గా సైలెంట్ అయ్యారు. మరోవైపు పార్టీలోనుండి వెళ్లగొట్టేలా సొంత పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తుండడంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితుల్లో ఉన్నారట. హస్తం పార్టీ సైతం నోఎంట్రీ బోర్డు పెట్టడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుకు చెక్‌మేట్ పడ్డట్లేనన్న చర్చ సాగుతోంది. చివరి ప్రయత్నంగా హస్తం పార్టీ తలుపులు తట్టాలని మరికొంతమంది సన్నిహితులు సలహా ఇస్తున్నారట. ఏది ఏమైనా తన తోటి లీడర్ల మూమెంట్ కనిపెట్టకపోవడం వల్లే.. ఈరోజు రాజయ్యకు ఈ పరిస్థితి వచ్చిందని తెగ జాలి పడుతున్నారు స్టేషన్‌పూర్ ప్రజలు.

# చెన్నైకి చిత్ర పరిశ్రమ

హైదరాబాద్: సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన తెలంగాణలో పెనుదుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో సిని పరిశ్రమ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు సినీ పరిశ్రమకు మద్దతుగా నిలుస్తున్నారు.అల్లు అర్జున్ పై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఫైర్ అయ్యారు. అనంతరం హీరో అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టారు. ఇప్పుడు ఈ వివాదంలో అల్లు అర్జున్, సినీ పరిశ్రమ లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారు. హీరో అల్లు అర్జున్ వెంటనే సీఎం రేవంత్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. తన ఇమేజ్ డ్యామేజ్ చేశారని సీఎం వ్యాఖ్యలపై అల్లు అర్జున్ ఎదురుదాడి చేయడం సరికాదన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు లీగల్ టీమ్ ఒప్పుకోలేదని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. ఇకపై తెలంగాణలో బెనిఫిట్ షోలు ఉండవన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తప్పు పట్టేలా సినీ హీరో అల్లు అర్జున్ వ్యవహరిస్తున్నారని, ఆయన తీరు దారుణంగా ఉందని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ నేపథ్యంలో ఆయన స్పందించారు. అల్లు అర్జున్‌లో తన చర్యలకు కనీసం పశ్చాత్తాపం వ్యక్తం చేయడంలేదన్నారు. రేవతి కుటుంబంపై సానుభూతి చూపించలేదన్నారు. మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ సభలో తెచ్చిన ప్రస్తావనపైనే సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై స్పందించారన్నారు. పోలీసులు చెప్పినా పట్టించుకోకుండా అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌లో షో చేశారన్నారు. ప్రాణాల కంటే పేరు ప్రతిష్ఠలు ఎక్కువా అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు.అల్లు అర్జున్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మండిపడ్డారు. తొక్కిసలాట ఘటనపై అల్లు అర్జున్ ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. విషాద ఘటన జరిగిన రోజే ప్రెస్‌మీట్ పెట్టి ఆ కుటుంబానికి అండగా ఉంటే బాగుండేదన్నారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేశారు. పోలీసుల నిర్లక్ష్యంతోనే సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆ ఘటనలో ఓ మహిళ మృతిచెందడం, బాలుడు తీవ్రంగా గాయపడడం బాధాకరమన్నారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం, సినీ పరిశ్రమ మద్దతుగా ఉండాలని డిమాండ్ చేశారు. అల్లు అర్జున్ పై కేసుపెట్టి ఇబ్బంది పెడుతున్నారన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అత్యంత ఘోరంగా మాట్లాడారని ఎర్రబెల్లి దయాకర్ అన్నారు. ఈ నేపథ్యంలో సినీ పరిశ్రమ ప్రముఖులు మళ్లీ చెన్నైకి వెళ్లాలని చర్చించుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు.సినీ పరిశ్రమపై సీఎం రేవంత్ రెడ్డి పగబట్టారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. హీరో అల్లు అర్జున్ వ్యక్తిత్వాన్ని హననం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. సంధ్య థియేటర్ ఘటనలో ఓ మహిళ మృతిచెందడం చాలా బాధాకరమన్నారు. బాలుడు శ్రీతేజ్ కోలుకోవాలని అంతా కోరుకుంటున్నారన్నారు. అయితే ఎంఐఎంతో కలిసి సినిమా లెవల్‌లో సీఎం రేవంత్ స్టోరీ అల్లారని విమర్శించారు. సమస్య ముగిసిన తర్వాత కూడా సీఎం అసెంబ్లీలో మళ్లీ దీని గురించి మాట్లాడడం సరికాదన్నారు. సినీ ఇండస్ట్రీని దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోందని విమర్శించారు. అసెంబ్లీలో గురుకుల విద్యార్థుల మరణాలపై సీఎం ఎందుకు స్పందించలేదని బండి సంజయ్ ప్రశ్నించారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని బండి సంజయ్ హితవు పలికారు.

# ఆన్లైన్ మోసాలకు గురికాకండి



కమాన్ పూర్: ప్రజలు ఆన్లైన్ మోసాలకు గురికా వద్దని షీ టీం ఇన్చార్జ్ స్నేహలత అన్నారు. రామగుండం సి.పి ఆదేశాల మేరకు, షి టీం ఇంచార్జ్ మల్లన్న ఆధ్వర్యంలో ధర్మారం మండలం నంది మ్యాడారం లోని బాలికల సోషల్ వెల్ఫేర్ స్కూల్ మరియు కాలేజీ విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు ఆంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. మరియు ఆకతాయిల నుండి ఎలా రక్షణగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షి టీం సభ్యుడు సురేష్, ప్రిన్సిపాల్ యుగేందర లక్ష్మి,ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# గజానికి 81 వేలు,...

హైదరాబాద్: నగరంలో మెట్రో రైలు నిర్మాణానికి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే.. మెట్రో మార్గాలను నిర్ణయించగా, అక్కడ సేకరించనున్న ఆస్తులకు సంబంధించిన ఆస్తులకు సంబంధించిన కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో మార్గంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకోనున్న ఆస్తులకు చెల్లించాల్సిన పరిహారంపై హైదరాబాద్ కలెక్టర్ నిర్ణయం ప్రకటించారు. దీంతో.. మెట్రో మార్గంలో నిర్మాణాలకు మరో ముందడుగు పడినట్లు అయ్యింది.ఓల్డ్ సిటీలో మెట్రో మార్గంలో రోడ్డు విస్తరణకు సంబంధించిన భూసేకరణ వేగవంతం అయిందని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్, హెచ్ ఏ ఎం ఎల్ అధికారులు ప్రభావిత ఆస్తుల యజమానులతో పలు దఫాలుగా సంప్రదింపులు జరిపారని తెలిపారు. తదనుగుణంగా.. సేకరించే ఆస్తుల నష్టపరిహారం చదరపు గజానికి రూ. 81,000/- గా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ నిర్ణయించారని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు.. ఆస్తులకు చెల్లింపులు చేయనున్నట్లు వెల్లడించారు.ఫేజ్-2లో భాగంగా.. కారిడార్ ఎఐ-ఎమ్ జీబీఎస్ నుంచి చంద్రాయణ్ గుట్ట వరకు 800 ఆస్తులను సేకరించాల్సి ఉంటుందని తెలిపిన అధికారులు.. వాటిని సేకరించేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. సంబంధిత ఆస్తుల యజమానులతో చర్చలు జరిపి ఒక చదరపు గజానికి రు. 81,000/- మేర చెల్లింపులు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే.. చాలా మంది ఈ ఒప్పందానికి అంగీకరించారని తెలిపిన అధికారులు.. వారంతా మెట్రో భవన్, రసూల్ పురా, బేగంపేట్ లోని కార్యాలయాలకు వెళ్లి అంగీకార పత్రాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. యజమానుల అంగీకారం తర్వాత పదిరోజుల్లోనే నష్టపరిహారాన్ని చెక్కు రూపంలో అందిస్తామని తెలిపారు.మిగిలిన ఆస్తుల యజమానులు కూడా వీలైనంత త్వరలో తమ అంగీకార పత్రాలను ఊంఓఒ కార్యాలయానికి అందజేస్తే వారికి కూడా నష్టపరిహారాన్ని చెక్కుల ద్వారా చెల్లిస్తామని ఎయిర్ పోర్ట్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో మెట్రో విస్తరణ పనులు వేగవంతంగా చేపట్టాలని ధృడ నిశ్చయంతో ఉన్నారని అందుకు అనుగుణంగా పాత నగరంలో భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నామని తెలిపారు.మెట్రో ప్రయాణికుల కోసం ప్రత్యేక ధరలతో ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీని అందించడానికి ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్‌తో.. రాపిడో ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకుంది. సుస్థిరమైన, సమర్థవంతమైన ప్రజా రవాణా లక్ష్యంగా తాము చేస్తున్న ప్రయత్నాలలో ఇదొక ముఖ్యమైన చొరవ అని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. ప్రయాణీకులను తమ గమ్యాలకు చేర్చే రాపిడో లాంటి వాహన సేవలు మహిళలకు కూడా తగు ప్రాధాన్యత కల్పించి, వారిని కూడా పైలట్ లుగా భాగస్వామ్యులయ్యేలా కృషి చేయాలని సూచించారు. దీని వల్ల మహిళలలో భద్రత భావం పెరుగుతుందని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

# దిశా, దశ లేకుండా కమలం,...

హైదరాబాద్: శాసన సభ సమావేశాలు వాడి వేడిగా ముగిసాయి.. ఒకవైపు ప్రజాపాలనతో ప్రభుత్వం ప్రగతి పథంలో దూసుకుపోతుంది. రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా పక్క ప్రణాళికలతో పాచికలు కదుపుతోంది. మరోవైపు అందుకు భిన్నంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల వ్యవహారం కనిపిస్తోంది. ఒకరు తానా అంటే మరొకరు తందాన అన్నట్టుగా అసెంబ్లీ సమావేశాల్లో ఆ రెండు పార్టీలు చేసిన వ్యవహారాన్ని టీవీ సిరియల్‌ల్లా చూస్తూ ప్రజలు నవ్వుకుంటున్న పరిస్థితి. తెలంగాణ పార్టీ అధ్యక్షుడిని ఎంపిక చేయడానికి మల్లగుల్లాలు పడుతుంది బీజేపీ అధిష్టానం. సమర్థుడైన నేత కోసం ఢిల్లీ పెద్దలు అన్వేషిస్తుంటే.. ఆ పార్టీకి ఉన్న 8 మంది ఎమ్మెల్యేలు ఎవరి దారి వారిదన్నట్లు వ్యవహరిస్తూ.. బీఆర్ఎస్ తోకలని ముద్ర వేయించుకుంటున్నారు.ఆ క్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎంపిక అంశం రోజుకొక మలుపు తిరుగుతోంది. నిన్నటి దాక బీసీకి ఇస్తారా..? రెడ్డి సామాజిక వర్గానికి ఇస్తారా.? ఏ సామాజిక వర్గానికి ఇస్తారు అనేది సస్పెన్స్ గా ఉండేది. కానీ ఆ పార్టీ ఎమ్మెల్యేలు చెబుతున్న లెక్కల ప్రకారం చూస్తుంటే .. అధిష్టానం లైన్ దాటకుండా మత ప్రాతిపదికన ఉన్న నేతలనే అధ్యక్ష పదవి కోసం ఎంపిక చేస్తారన్న చర్చ మొదలైంది. ఎందుకంటే ఉన్న 8మంది ఎమ్మెల్యేలలో అధ్యక్ష ఎంపికపై కేవలం కొంత మంది ఎమ్మెల్యేల అభిప్రాయం మాత్రమే తీసుకున్నారంట. అందులో ప్రధానంగా పైడి రాకేష్ రెడ్డి, రాజసింగ్‌లకు మాత్రమే అధిష్టానం అధ్యక్ష పదవి ఆఫర్ ఇచ్చిందంట. కీలకమైన పార్టీ అధ్యక్ష పదవిపై మిగతా ఎమ్మెల్యేల అభిప్రాయాలు తీసుకోకపోడం పార్టీలో హాట్ హాట్ టాపిక్‌గా మారింది. అధిష్టానం కేవలం పైడీ రాకేష్ రెడ్డి, రాజాసింగ్ ల అభిప్రాయాలు మాత్రమే వారికి పదవి ప్రతిపాదన పెట్టిన సందర్భంగా పార్టీ పెద్దలకి, వారికి మధ్య చర్చ జరిగిందంటున్నారు.పైడి రాకేష్ రెడ్డికి రాష్ట్ర అధ్యక్ష పదవి అధిష్టానం ఆఫర్ చేస్తే.. ఆయన నిరాకరించా రంట. అధ్యక్ష పదవి ఇస్తానంటే కేవలం మూడు జిల్లాలకే ఇన్చార్జిగా బాధ్యతలు ఇవ్వాలని అడిగారంట. అదే ఇప్పుడు పార్టీలో చర్చనీయాం శంగా మారింది. పార్టీ సంస్థాగత ఎన్నికలు జరుగుతున్న తరుణంలో అధ్యక్షులు ఎవరో తేలిపోయిందని, సంక్రాంతి తరువాత కొత్త అధ్యక్షుడు రాబోతున్నారని.. రాష్ట్రంలో పార్టీ చాలా బలహీనంగా ఉందని.. పార్టీ బలోపేతం కావల్సిన అవసరం ఉందని..అందులో భాగంగానే ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ మూడు జిల్లాలకు ఇన్చార్జ్‌గా ఇవ్వమని అధిష్టానాన్ని అడిగానని పైడి రాకేష్‌రెడ్డి అంటున్నారంట.అధిష్టానానికి పైడి రాకేష్‌రెడ్డి చేసిన ప్రతిపాదన తెలియడంతో పార్టీ వర్గాలు ఆయనపై గుర్రుగా ఉన్నాయి. అంతేకాదు అధ్యక్ష పీఠం ఎక్కేవారు మత మీటర్ లేకుండా కిలో మీటర్ కూడా నడవలేని నేతల కోసమే అధిష్టానం వేతుకుందా? అనే డైలమాలో పార్టీ శ్రేణులు ఉన్నాయి. అయితే మరోవైపు పైడి రాకేష్ రెడ్డి ఏంటి, అధిష్టానం ఆయనకు అధ్యక్ష పదవి ఆఫర్ చేయడమేంటి?..ఆయన వద్దనడమెంటి? ఎవరి పాటికి వారు అధ్యక్ష పదవి, పార్టీ బలహీనతల గురించి ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడుతుం దటంపై రాష్ట్ర నాయకత్వం గుర్రుగా ఉందంట. ఏదేమనా నిజంగా అధిష్టానం ఆ ఇద్దరు ఎమ్మెల్యేలకే ప్రెసిడెంట్ పోస్టు ఆఫర్ ఇచ్చి ఉంటే.. రాకేష్‌రెడ్డి వద్దనడంతో.. రాజాసింగ్ కొత్త అధ్యక్షుడవుతారా? అన్నది పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది.మొత్తం ఉన్న 8 మంది ఎమ్మెల్యేలు అటూ అసెంబ్లీలో, ఇటూ మీడియా ముందు ఎవరు, ఎప్పుడు, ఏం మాట్లాడుతున్నారో తెలియక ? ఇటు సొంత పార్టీతో పాటు, అటూ అధికార, విపక్ష పార్టీల్లో నవ్వుల పాలు అవుతున్నారనే టాక్ బలంగా వినిపిస్తుంది. మరి తెలంగాణలో అధికారంపై బోల్డు ఆశలు పెట్టుకున్న ఢిల్లీ కమల నాథులు ఇక్కడ నేతలను ఎప్పటికి? ఎలా? గాడిలో పెడతారో చూడాలి

# కాంగ్రెస్ లో అసమ్మతి రాగాలు

కరీంనగర్: కరీంనగర్ కాంగ్రెస్ పార్టీలో ముసలం మొదలైంది. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యత దక్కడం లేదంటూ డీసీసీ ఆఫీస్‌లో అసమ్మతి నేతలు సమావేశమవటం..రచ్చకు దారి తీస్తోంది. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని సీనియర్లు అసహనం వ్యక్తం చేశారు. కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ పురమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఓపెన్ సీక్రెట్ మీటింగ్‌కు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరవడంతో పార్టీలో ఒక్కసారిగా కలకలం మొదలైంది. అంతర్గత విభేధాలు రచ్చకెక్కినట్లయింది. అధిష్టానం తీరుపైనా కొందరు అసహనం వ్యక్తం చేస్తే.. మరికొందరు ఏకంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌నే టార్గెట్ చేస్తూ తమ ఆవేదనను వెళ్లగక్కారట.నియోజకవర్గ ఇంచార్జ్ కీలకం అని సీఎం రేవంత్ రెడ్డి చెప్తుంటే..తనకు తెలియకుండానే మంత్రి పొన్నం ప్రభాకరే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆగ్రహంగా ఉన్నారట పురమళ్ళ శ్రీనివాస్. ఇటీవల భర్తీ చేసిన సుడా చైర్మన్, లైబ్రరీ చైర్మన్ నామినేటేడ్ పదవులతో పాటు నిధుల కేటాయింపు, ఇసుక రీచ్‌ల కేటాయింపులన్నీ ఎవరికీ సంబంధం లేకుండా మంత్రి పొన్నం సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారట. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి శ్రీధర్ బాబు జిల్లా కేంద్రానికి వస్తే సమాచారం ఇస్తున్నారు కానీ..మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఇతర మంత్రులు వస్తే సమాచారం ఇవ్వడం లేదంటూ మండిపడుతున్నారట జిల్లా కాంగ్రెస్ సీనియర్ నేతలు. కనీసం ప్రోటోకాల్ కూడా పాటించడం లేదని..కార్యకర్తలకు పనులు అవసరమైతే ఎవరి దగ్గరికి వెళ్లాలో తెలియడం లేదంటున్నారు. ప్రతిపక్షంలో చెమటోడ్చి శ్రమిస్తే ఇప్పుడు అధికారంలో ఉన్నామన్న ఆనందం లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారట మరికొందరు నేతలు.కరీంనగర్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ గెలవకపోవడంతో..మంత్రుల దగ్గరకు క్యాడర్ వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులే అయినా?ఎవరి అనుచరవర్గం వారిని ఫాలో అవుతున్నారు. అయితే క్యాడర్ ఎవరి వెంట నడవాలో అర్థం కానీ గందరగోళం నెలకొందట. తమ నేతలను టార్గెట్ చేయడంపై పొన్నం అనుచరులు సీరియస్ అవుతున్నారు. ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చినవారు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదంటూ వార్నింగ్ ఇస్తుండటంతో..ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా మారిపోయింది కరీంనగర్ కాంగ్రెస్ లీడర్ల పరిస్థితి. పార్టీని బలోపేతం చేయాల్సిందిపోయి..వర్గ విభేధాలతో నష్టం చేస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.డీసీసీ కార్యాలయంలో జరిగిన మీటింగ్‌పై అధిష్టానం సీరియస్‌గా ఉందట. ఆ మీటింగ్‌లో పాల్గొని మంత్రి పొన్నంకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిని ఎలాగైనా పార్టీ నుంచి పంపించేయాలనే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయనే టాక్ వినిపిస్తోంది. షోకాజ్ నోటీసులు కూడా రెడీ అవుతున్నాయట. మరి కరీంనగర్ కాంగ్రెస్‌లో మొదలైన ముసలం ఎటుదారి తీస్తుందో వేచి చూడాలి.

# పంచాయితీ ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన

కరీంనగర్: తెలంగాణ లోకల్ బాడీ ఎలక్షన్స్‌కు సంబంధించి కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇద్దరు పిల్లల నిబంధనను కొనసాగించాలని నిర్ణయించింది. దీంతో చాలామందికి నిరాశే ఎదురైంది. ఈ నిబంధనను తొలగిస్తారని చాలామంది ఆశించారు. కానీ.. కొనసాగించాలని కేబినెట్ నిర్ణయించిందితెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లలకు మించి ఉన్న వారు అనర్హులనే నిబంధన కొనసాగనుంది. ఈ నిబంధనను మార్చాలని వచ్చిన ప్రతిపాదనలను తెలంగాణ కేబినెట్ తిరస్కరించింది. పాత నిబంధననే కొనసాగించాలని పంచాయతీరాజ్ శాఖను ఆదేశించింది. గురువారం శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లులో దీనికి సవరణ చేయలేదు.కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా 1994లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో.. ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులని చట్టం చేశారు. అయితే.. ప్రస్తుతం కుటుంబ నియంత్రణపై అవగాహన ఉన్నందున.. ఆ నిబంధనను మార్చి ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారికి సైతం పోటీ చేసే అవకాశం ఇవ్వాలని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు కోరారు. దీనిపై కొందరు మంత్రులు కూడా హామీ ఇచ్చారు.ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ.. చట్టసవరణ ప్రతిపాదనల్లో ఈ అంశాన్ని చేర్చింది. కేబినెట్ ఆమోదానికి పంపింది. కానీ.. దీన్ని మంత్రిమండలి ఆమోదించలేదు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటుపై శాస్త్రీయ ఆధారాలు లేకపోవడం, నిబంధన మార్పును కొన్ని వర్గాలు వ్యతిరేకిస్తాయనే కారణంతో.. ఈ ప్రతిపాదనను నిరాకరించినట్లు చర్చ జరుగుతోంది.గత ఎన్నికల సమయంలో ఈ నిబంధనను తొలగిస్తారని అంతా భావించారు. ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు ఎన్నికలకు రెడీ అయ్యారు. కానీ అప్పుడు కూడా నిబంధనను మార్చలేదు. మళ్లీ ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ చర్చ జరిగింది. మంత్రులు కూడా హామీ ఇవ్వడంతో.. నిబంధనను తొలగిస్తారని ఆశించారు. కానీ.. ఇప్పుడు కూడా నిరాశే ఎదురైంది.స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ అడ్డంకిగా మారిన నిబంధనపై ఏపీ అసెంబ్లీ ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. ఇద్దరికంటే ఎక్కువ మంది సంతానం ఉన్నవారు స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు ఇకపై అనర్హులుగా ప్రకటించే నిబంధనను.. ఆంధ్రప్రదేశ్ శాసనసభ రద్దు చేసింది. ఈ మేరకు చట్ట సవరణ బిల్లును ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవంగా అమోదించింది.దాదాపు 30 ఏళ్ల తర్వాత ఈ నిబంధనను ఏపీలో తొలగించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గిపోవడంతో పాటు వృద్ధుల సంఖ్య పెరగడం, ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తగ్గిపోవడం వంటి అంశాలను పరిశీలించి ఏపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో సంతానోత్పత్తి సామర్థ్యం రేటు 2001లో 2.6శాతం ఉంటే 2024నాటికి అది 1.5శాతం మాత్రమే ఉంది.

# జాబితాలో పేరు లేకపోవడంతో మను భాకర్ తీవ్ర అసంతృప్తికి గురైందన్న తండ్రి

**- ఒలింపిక్స్ కు వెళ్లకుండా ఉండాల్సిందని వాపోయిందన్న తండ్రి**
**- తన కూతురును షూటర్ కాకుండా క్రికెటర్ ను చేయాల్సిందని వ్యాఖ్య**
**- 2024 పారిస్ ఒలింపిక్స్ లో రెండు పతకాలు సాధించిన మను భాకర్**




ఖేల్ రత్న అవార్డుల నామినీ లిస్ట్ లో తన పేరు లేకపోవడంపై మను భాకర్ తీవ్ర అసంతృప్తికి లోనైందని ఆమె తండ్రి రామ్ కిషన్ భాకర్ పేర్కొన్నారు. ఈమేరకు ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రామ్ కిషన్ మాట్లాడుతూ.. ఖేల్ రత్న అవార్డులకు సంబంధించిన నామినీల జాబితాలో మను పేరు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తను ఒలింపిక్స్ కు వెళ్లకుండా ఉండాల్సిందని, మెడల్స్ సాధించకపోయినా బాగుండేదని మను వ్యాఖ్యానించిందని చెప్పారు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ప్రకటించిన నామినీ జాబితాపై రామ్ కిషన్ విమర్శలు చేశారు. దేశానికి రెండు ఒలింపిక్ మెడల్స్ సాధించినా తన కూతురుకు తగిన గుర్తింపు రాలేదన్నారు.

తన కూతురుకు షూటింగ్ నేర్పించినందుకు తాను ఇప్పుడు చింతిస్తున్నట్లు చెప్పారు. షూటర్ కాకుండా మనును క్రికెటర్ ను చేస్తే బాగుండేదని, అప్పుడు అవార్డులు ఆమెను వెతుక్కుంటూ వచ్చి ఉండేవని అన్నారు. 2024 ఒలింపిక్స్ లో భారత అథ్లెట్ లు ఎవరూ సాధించని ఘనత తన కూతురు సాధించిందని, రెండు మెడల్స్ గెల్చుకుందని గుర్తుచేశారు. అయినప్పటికీ ఆమె పేరును ఖేల్ రత్న అవార్డు పరిశీలనకు తీసుకోకపోవడం సరికాదని అన్నారు.

తన కృషికి తగిన గుర్తింపు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఖేల్ రత్న అవార్డు కోసం మను ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుందని, కనీసం తన పేరును ప్రభుత్వం పరిశీలిస్తుందని భావించిందని చెప్పారు. తీరా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నామినీల లిస్ట్ లో తన పేరు లేకపోవడంతో మను తీవ్ర ఆవేదనకు లోనైందని చెప్పారు. తాను అసలు క్రీడాకారిణిగా కాకుండా ఉండాల్సిందని తనతో వాపోయిందని రామ్ కిషన్ భాకర్ చెప్పారు.

# తెలంగాణ బిడ్డకు అర్జున అవార్డ్!




ప్రతిష్టాత్మక జాతీయ క్రీడా పురస్కారాల ప్రకటనకు రంగ సిద్ధమైంది. సుప్రీం కోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ వి. రామసుబ్రహ్మణ్యం సారథ్యంలోని 12 మంది సభ్యుల సెలెక్షన్ కమిటీ అర్జున, ఖేల్ రత్న, ద్రోణా చార్య, ధ్యాన్ చంద్ తదితర అవార్డులకు సంబంధించిన నామినేషన్ల జాబితాలను కేంద్ర ప్రభుత్వానికి అందించింది.

ఒకటి రెండు మార్పులు మినహా ఇదే జాబితా ఖాయమయ్యే అవకాశం ఉంది.

ఈ నామినేషన్స్‌లో తెలంగాణ పారా అథ్లెట్, వరంగల్ బిడ్డ దీప్తి జివాంజీకి చోటు దక్కింది. పారిస్ పారాలింపిక్స్‌లో 400 మీటర్ల పరుగు(టీ20) కేటగిరిలో కాంస్యం గెలుచుకున్న దీప్తిని అర్జున అవార్డ్‌కు సెలెక్షన్ కమిటీ సిఫార్స్ చేసింది. దీప్తి జివాంజీ ఆసియా పారాలింపిక్స్, వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌ల్లో స్వర్ణాలు సాధించింది. దీప్తి జివాంజీతో పాటు మొత్తం 30 మంది సభ్యులు అర్జున్ అవార్డ్‌కు నామినేట్ అయ్యారు.

ప్రతిష్టాత్మక క్రీడా పురస్కారమైన ఖేల్ రత్నకు భారత పురుషుల హాకీ టీమ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్‌తో పాటు పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్‌ను ప్రతిపాదించారు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల టీమ్ కాంస్య పతకం సాధించిన విషయం తెలిసిందే. టోక్యో ఒలింపిక్స్‌లోనూ భారత హాకీ టీమ్ కాంస్య పతకం సాధించింది. ఈ రెండు విజయాల్లో 28 ఏళ్ల హర్మన్‌ప్రీత్ కౌర్ కీలక పాత్ర పోషించాడు. ఆసియా గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్, ఛాంపియన్స్ ట్రోఫీల్లో భారత హాకీ టీమ్ పతకాలు గెలవడంలోనూ హర్మన్ ప్రీత్ కీలకంగా వ్యవహరించాడు. పారిస్ పారాలింపిక్స్ హైజంప్(టీ64 క్లాస్)లో ప్రవీణ్ స్వర్ణ పతకం సాధించిన సంగతి తెలిసిందే. 2020 టోక్యో ఒలింపిక్స్‌లోనూ ప్రవీణ్ ఇదే విభాగంలో కాంస్య సాధించాడు.

పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలు సాధించిన షూటర్ మనూ భాకర్‌ను ఈ ప్రతిష్టాత్మక అవార్డ్సుకు నామినేట్ చేయకపోవడం చర్చనీయాంశమైంది. ఒలింపిక్స్‌లో రెండు మెడల్స్ సాధించిన అథ్లెట్‌గా మరో చర్చ లేకుండా ఖేల్ రత్న అవార్డుకు ఆమె అర్హురాలు. కానీ ఈ అవార్డు కోసం మనూ భాకర్ దరఖాస్తు చేసుకోలేదని క్రీడా మంత్రిత్వశాఖ వర్గాలు పేర్కొన్నాయి. కానీ మనూ భాకర్ తండ్రి రామ్ కిషన్ ఈ వాదనను ఖండించాడు. తాను సరైన ఫార్మాట్‌లోనే దరఖాస్తు చేసానని స్పష్టం చేశారు. దరఖాస్తు చేయకపోయినా.. ప్రదర్శనను బట్టి అవార్డుకు ఎంపిక చేసే అధికారం జ్యూరీకి ఉంది.

# ఎవరీ తనుష్ కోటియన్? అశ్విన్‌ను భర్తీ చేసే దమ్ముందా?

టెస్ట్ క్రికెట్‌లో గత 12 ఏళ్లుగా సొంతగడ్డపై టీమిండియా అజేయంగా నిలవడానికి ప్రధాన కారణం స్పిన్ ద్వయం రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా. గత దశాబ్దంగా ఈ ఇద్దరు తమ స్పిన్‌తో ప్రత్యర్థి జట్లను ముప్పు తిప్పలు పెట్టారు.

అయితే అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో జడేజా ఒంటరయ్యాడు. ఈ నేపథ్యంలో అశ్విన్ స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడు ఎవరా? అనే ప్రశ్న తలెత్తింది.

ఇప్పటికే జట్టులో రవీంద్ర జడేజాకు తోడుగా వాషింగ్టన్ సుందర్ ఉండగా.. అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే బీసీసీఐ మాత్రం కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌లను కాకుండా యువ స్పిన్నర్ తనుష్ కోటియన్‌ను ఎంపిక చేసింది. 26 ఏళ్ల తనుష్ కోటియన్ దేశవాళీ క్రికెట్‌లో ముంబై జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. మహారాష్ట్రకు చెందిన తనుష్ కొటియన్ ఆఫ్ స్పిన్ బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ కూడా చేయగలడు.



ఇప్పటి వరకు 33 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన తనుష్ కోటియన్ 25.70 సగటుతో 101 వికెట్లు పడగొట్టాడు. ఇందులో మూడు సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. అశ్విన్‌లాగే బ్యాటింగ్ కూడా చేయగల తనుష్ కోటియన్.. రెండు శతకాలతో పాటు 13 హాఫ్ సెంచరీలతో 1525 పరుగులు చేశాడు. అతని బ్యాటింగ్ యావరేజ్ 41 కావడం విశేషం. గతేడాది ముంబై రంజీ ట్రోఫీ గెలవడంతో తనుష్ కోటియన్‌దే కీలక పాత్ర. ఈ టోర్నీలో తనుష్ 29 వికెట్లు తీయడంతో పాటు 502 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ అవార్డ్ అందుకున్నాడు. ఇటీవల భారత్-ఏ జట్టుతో ఆస్ట్రేలియాలో పర్యటించాడు. ఈ ప్రదర్శనతోనే తనుష్ కోటియన్‌ను జట్టులోకి తీసుకున్నామని కూడా రోహిత్ శర్మ తెలిపాడు.

అశ్విన్ తరహాలోనే తనుష్ కోటియన్ వద్ద కూడా వైవిధ్యమైన బంతులున్నాయి. ముఖ్యంగా ఊరించే బంతులతో బ్యాటర్లను బోల్తా కొట్టించడం తనుష్ స్పెషాలిటీ. అతని బౌలింగ్ ఆడే ప్రయత్నంలో బ్యాటర్లు స్లిప్ క్యాచ్‌గా వెనుదిరుగుతారు. కొన్ని బంతులు అనూహ్యంగా నేరుగా వచ్చి ఎల్బీ డబ్ల్యూకు కారణం అవుతాయి. భారత పిచ్‌లపై అతను సమర్థవంతంగా బౌలింగ్ చేయగలడు. కానీ సొంతగడ్డపై అతనికి తుది జట్టులో అవకాశం ఇస్తారా? లేదా? అనేది చూడాలి.

# అందుకే రిటైర్మెంట్ ప్రకటించా: అశ్విన్




తనలోని సృజనాత్మకతకు భవిష్యత్తు లేదనిపించడంతోనే రిటైర్మెంట్ ప్రకటించానని టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం టీమిండియాతో కలిసి ఆసీస్ పర్యటనకు వెళ్లిన అశ్విన్..

గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్ట్ అనంతరం ఆకస్మాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించాడు. దాంతో అందరూ అవాక్కయ్యారు.

ఇంత త్వరగా.. సిరీస్ మధ్యలో అశ్విన్ ఎందుకు రిటైర్మెంట్ తీసుకున్నాడని తర్జన భర్జనలు పడ్డారు. ఏదో అసంతృప్తితోనే తప్పుకున్నాడని కూడా సందేహాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అశ్వినే స్వయంగా తన రిటైర్మెంట్ గల కారణాన్ని వెల్లడించాడు. ఓ ఛానెల్‌తో మాట్లాడుతూ.. తన రిటైర్మెంట్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'నేను ఏ విషయాన్నైనా పెద్దగా సాగతీయను. జీవితంలో ఏ రోజు కూడా అభద్రతా భావానికి గురి కాలేదు. ఈ రోజు నాకు దక్కింది. రేపు కూడా నా వద్దే ఉంటుందని ఏ మాత్రం నమ్మను. ఈ ఆలోచన విధానమే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. నేను చాలా పెద్దగా ఆలోచిస్తాను. నా గురించి జనాలు సంబరాలు చేసుకుంటున్నారంటే అస్సలు నమ్మను. నా కంటే ఆటే గొప్పదని భావిస్తాను. నా రిటైర్మెంట్‌పై నేను చాలా సార్లు ఆలోచించాను. ఏ రోజైనా నిద్ర లేవగానే నాలోని సృజనాత్మకతకు భవిష్యత్తు లేదనుకుంటే అదే రోజు నేను ఆటను వదిలేస్తాను. హఠాత్తుగా ఎందుకో నాకు ఆ రోజు అలాగే అనిపించింది. అందుకే వదిలేశాను. ఆట కోసం నా సర్వస్వం ఇచ్చాను. గత కొన్నేళ్లుగా విభిన్నమైన నైపుణ్యాలు, ప్రతిభతో చాలా క్రికెట్ ఆడాను. నా ఆట గురించి ఇతరులకు చెప్పగలగడం చాలా ప్రత్యేకమైంది. మనల్ని మనం అన్వేషించుకొంటేనే అది సాధ్యమవుతోంది. ఆట గురించి మాట్లాడే విస్తృతమైన పరిజ్ఞానాన్ని నాకు ఇచ్చింది. రిటైర్మెంట్ ప్రకటించినందుకు ఎలాంటి పశ్చాత్తాపం లేదు. ఎందుకంటే అది పూర్తిగా నా నిర్ణయం. క్రికెట్ నాకు చాలా ఇచ్చినందుకు సంతోషంగా ఉంది.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీపై అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఇతర కెప్టెన్ల కన్నా ధోనీ సారథ్యం విభిన్నంగా ఉంటుందని చెప్పాడు.'ధోనీ ప్రాథమిక విషయాలను బాగా చేస్తాడు. కానీ, చాలా మంది కెప్టెన్లు వాటిని పెద్దగా పట్టించుకోరు. దాంతో మ్యాచ్ వారికి సమస్యగా మారిపోతుంది.

ధోనీ బౌలర్ చేతికి బంతిని ఇస్తూనే అవసరమైన ఫీల్డింగ్ పేటుకోమని చెబుతాడు. అందుకు తగ్గట్లు బంతులు వేయమంటాడు. కొన్నిసార్లు బ్యాటర్లు.. బౌలర్ల లూజ్ డెలివరీలను బౌండరీ బాదినా ఏమనడు. బౌలింగ్ నుంచి తప్పించడు. కానీ నా బౌలింగ్‌లో ఎవరైనా కట్ లేడ్ డ్రైవ్ షాట్ ఆడితే మాత్రం ధోనీ కోప్పడుతాడు. బౌలింగ్ కూడా ఇవ్వడు. ఇలాంటి ప్రాథమిక విషయాల్లో ధోనీ కఠినంగా ఉంటాడు కాబట్టే ధోనీ సక్సె స్ అయ్యాడు.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

# నాలుగో టెస్ట్‌లో టీమిండియా ఓపెనర్ ఎవరా? అనేది సీక్రెట్: రోహిత్ శర్మ

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా మెల్ బోర్న్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగే నాలుగో టెస్ట్‌లో టీమిండియా ఓపెనర్ ఎవరా? అనేది సీక్రెట్ అని కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు.

జట్టుకు మేలు చేసే నిర్ణయం తీసుకుంటామని చెప్పాడు. తన గాయం చిన్నదని, ఫిట్‌గా ఉన్నానని స్పష్టం చేశాడు.

నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా.. రోహిత్ శర్మ మోకాలికి బంతి బలంగా తాకింది. దాంతో ఫిజియోతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకున్నాడు. ఈ క్రమంలోనే నాలుగో టెస్ట్ రోహిత్ ఆడుతాడా? లేదా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. నాలుగో టెస్ట్ నేపథ్యంలో రోహిత్ శర్మ మంగళవారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా తన గాయానికి సంబంధించిన అప్‌డేట్ ఇచ్చాడు. తీవ్రమైన గాయం కాదని, తన మోకాలు బాగానే ఉందని చెప్పాడు.

'నా గాయం చిన్నదే. నేను ఫిట్‌గానే ఉన్నాను. టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్ గురించి ఆలోచించకండి. కొన్ని విషయాలు బయటపెట్టాలి. మరికొన్ని దాచిపెట్టాలి. జట్టుకు ఏది మంచిదో అదే చేస్తాం. టీమిండియా ఓపెనర్ ఎవరా? అనేది సీక్రెట్. విరాట్ కోహ్లీ తన ఆఫ్ స్టంప్ బలహీనతను అధిగమించే ప్రయత్నం చేస్తున్నాడు. యశస్వి జైస్వాల్ సహజ శైలిలో ఆడుతాడు. అతనికి స్వేచ్ఛగా ఆడే అవకాశం ఇవ్వాలి. అతను మా అందరి కంటే తన బ్యాటింగ్‌ను బాగా అర్థం చేసుకుంటాడు.'అని రోహిత్ శర్మ తెలిపాడు.



పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న శుభ్‌మన్ గిల్‌కు కూడా రోహిత్ అండగా నిలిచాడు.'అడిలైడ్ వేదికగా జరిగిన టెస్ట్‌లో శుభ్‌మన్ గిల్ రెండు ఇన్నింగ్స్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేశాడు. కానీ భారీ స్కోర్లుగా మల్చలేకపోయాడు. మా కుర్రాళ్ల ఆశావహుల్లో గిల్ ఒకడు. ప్రతీసారి భారీ స్కోర్లు చేయడం అంత సులువైన పనికాదు. గిల్ నాణ్యమైన ఆటగాడు. అతను బ్యాటింగ్‌ను అర్థం చేసుకుంటాడు. భారత జట్టులోకి రాకముందు అతను చాలా పరుగులు చేశాడు.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు. రిషభ్ పంత్ ఫామ్‌పై కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రోహిత్ శర్మ తెలిపాడు. 'ఇటీవల రిషభ్ పంత్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనంత మాత్రానా అతనిపై ఓ నిర్ణయానికి రావడం సరికాదు. ఏం చేయాలో అతనికి బాగా తెలుసు. భారత ఆటగాళ్లంతా ఒకే పడవలో ఉన్నాడు. వారు చేసే పనిని క్లిష్టతరం చేయాల్సిన అవసరం లేదు. జట్టు కోసం ఏం చేయాలో వారికి బాగా తెలుసు.'అని రోహిత్ బదులిచ్చాడు.

# అతనికి వీసా లేకపోవడంతో తనుష్ కోటియన్‌ను తీసుకున్నాం: రోహిత్ శర్మ




టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి తన ఎటకారంతో నవ్వులు పూయించాడు. టీమిండియా సీనియర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు ఆస్ట్రేలియాకు వచ్చేందుకు వీసా లేదని, అందుకే యువ స్పిన్నర్ తనూష్ కోటియన్‌ను ఎంపిక చేశామని సెటైర్లు పేల్చాడు. దాంతో అక్కడ నవ్వులు పూసాయి.

సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించడంతో అతని స్థానంలో ముంబై ఆల్‌రౌండర్ తనూష్ కోటియన్‌ను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. చివరి రెండు టెస్ట్‌లకు తనూష్ కోటియన్ అందుబాటులో ఉండనున్నాడు.

రోహిత్ ఎటకారం..!

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్ వేదికగా నాలుగో టెస్ట్ జరగనుంది. గురువారం నుంచి ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ టెస్ట్ నేపథ్యంలో రోహిత్ శర్మ మంగళవారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా కుల్దీప్ యాదవ్‌ను కాదని తనూష్ కోటియన్ ఎంపిక చేయడంపై రిపోర్టర్స్ ప్రశ్నించగా తనదైన శైలిలో బదులిచ్చాడు.

'కుల్దీప్ యాదవ్‌కు ఆస్ట్రేలియా వీసా లేదు. తనూష్ కోటియన్ భారత్-ఏ తరఫున గత నెలలో ఇక్కడికి వచ్చాడు. మాకు వీలైనంత త్వరగా జట్టులో చేరే ఆటగాడు కావాలి. అందుకు తనుష్ సిద్ధంగా ఉండటంతో ఎంపిక చేశాం. కానీ ఇదంతా జోక్. తనుష్ కోటియన్ ఇప్పటికే ఆసీస్ గడ్డపై ఆడాడు. గత రెండేళ్లుగా దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. మాకు బ్యాకప్ స్పిన్నర్ కావాలనుకున్నాం. సిడ్నీలో ఇద్దరు స్పిన్నర్ల ఆడాల్సిన పరిస్థితి ఏర్పడితే బ్యాకప్ అవసరమవుతోంది.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

కుల్దీప్ ఫిట్‌గా లేడు..

కుల్దీప్ యాదవ్.. హెర్నియా సర్జరీ చేయించకున్నాడని, ఇటీవలే అక్షర్ పటేల్ తండ్రి అవ్వడంతో సెలెక్షన్‌కు అందుబాటులో లేడని రోహిత్ శర్మ వివరణ ఇచ్చాడు. 'కుల్దీప్ యాదవ్ 100 శాతం ఫిట్‌గా లేడు. అతనికి హెర్నియా సర్జరీ జరిగింది. మరో ఆప్షన్ అయిన అక్షర్ పటేల్ ఇటీవలే తండ్రయ్యాడు. అతను ఆసీస్‌కు వచ్చేందుకు సిద్ధంగా లేడు. దాంతో మాకు తనుష్ సరైన ఆప్షన్ అనిపించింది. దేశవాళీ క్రికెట్‌లో అతను తన సత్తా ఏంటో చూపించాడు. గతేడాది ముంబై రంజీ ట్రోఫీలో గెలవడంలో అతను ఆల్‌రౌండర్‌గా కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్ సామర్థ్యం కూడా ఉండటంతో మాకు సరైన ఆప్షన్ అనిపించింది.'అని రోహిత్ శర్మ తెలిపాడు.

తనూష్ ట్రాక్ రికార్డ్..

ఆఫ్ స్పిన్నర్ అయిన 26 ఏళ్ల తనుష్ కోటియన్ ముంబై తరఫున దేశవాళీ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు. ప్రతిష్టాత్మక వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా అహ్మదాబాద్ వేదికగా హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై తరఫున తనుష్ కోటియన్ మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. 10 ఓవర్లు బౌలింగ్ చేసి 38 పరుగులే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు.

అశ్విన్ తరహాలో ఆఫ్ స్పిన్ వేయడంతో పాటు లోయరార్డర్‌లో బ్యాటింగ్ చేయగల సామర్థ్యం ఉండటం తనుష్ కోటియన్‌కు కలిసొచ్చే అంశం.

ఇప్పటి వరకు 33 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన తనుష్ కోటియన్ 101 వికెట్లు పడగొట్టాడు. ఇందులో మూడు సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు.

బ్యాటర్‌గా రెండు శతకాలతో పాటు 13 హాఫ్ సెంచరీలతో 1525 పరుగులు చేశాడు.

# సెమీఫైనల్లో ఢిల్లీ.. తెలుగు టైటాన్స్ భవితవ్యం తేలేది నేడే!

అషు మలిక్(14) అసాధారణ ప్రదర్శనతో ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన ఢిల్లీ ఫస్టాఫ్ ముగిసే సమయానికి 20-17తో ఆధిక్యంలో నిలిచింది. సెకండాఫ్‌లోనూ అదే జోరు కొనసాగించి విజయాన్ని సొంతం చేసుకుంది.

ఈ గెలుపుతో దబాంగ్ ఢిల్లీ పాయింట్స్ టేబుల్‌లో రెండో స్థానంలో నిలిచింది. 22 మ్యాచ్‌ల్లో 13 విజయాలతో పాటు 4 టైలతో ముందంజ వేసింది. పట్నా పైరేట్స్ కూడా 13 విజయాలు సాధించినా.. అత్యధిక టైలతో ఢిల్లీకి సెకండ్ ప్లేస్ దక్కింది.

16 విజయాలతో హర్యానా స్టీలర్స్ టాప్ ప్లేస్ దక్కించుకోని సెమీఫైనల్ చేరిన సంగతి తెలిసిందే. పట్నా పైరేట్స్, యూపీ యోధాస్, జైపూర్ పింక్ పాంథర్స్ మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచి ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాయి. ఆరో స్థానంలో యూ ముంబా, తెలుగు టైటాన్స్ మధ్య పోటీ నెలకొంది. తెలుగు టైటాన్స్ ఇప్పటికే ఆడాల్సిన మ్యాచ్‌లు అయిపోగా.. ముంబాకు ఓ మ్యాచ్ మిగిలింది. ఈ మ్యాచ్ ఫలితాన్ని బట్టి చివరి ప్లే ఆఫ్స్ బెర్త్ ఎవరిదా? అనేది తేలనుంది.

నేటి రాత్రి 9 గంటలకు బెంగాల్ వారియర్స్‌తో యుముంబా తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే ప్లే ఆఫ్స్ బెర్త్ దక్కుతోంది. 48 పాయింట్ల తేడాతో ఓటమిపాలైతే మాత్రం తెలుగు టైటాన్స్ ప్లే ఆఫ్స్ చేరుతోంది. ప్రో కబడ్డీ చరిత్రలోనే ఇలాంటి ఫలితం ఇప్పటి వరకు ఎదురు కాలేదు. సోమవారం జరిగిన మరో మ్యాచ్‌లో పుణెరి పల్టాన్ 42-32 తేడాతో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది. ఆర్యవర్ధన్(10), అజిత్(7) పుణెరి పల్టాన్ విజయంలో కీలక పాత్ర పోషించారు.

పీకేఎల్ ప్లే ఆఫ్స్ ఫార్మాట్ ఏంటంటే..?

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 **SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**